PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 85 | విజయవాడ, ఆదివారం 26 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 26 October 2025 | Rs

కారుణ్య మరణానికి అవకాశం ఇవ్వండి

- రాయపూడికి చెందిన వృద్ధురాలు హైకోర్టులో పిటిషన్
- భూమి తీసుకుని ఖాళీ చేయాలని సిఆర్‌డిఎ ఒత్తిడి
- విచారణకు వారం రోజులు వాయిదా

2




రో-కో అదరహో...

- రోహిత్ సెంచరీ, కోహ్లి అర్ధసెంచరీ
- మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం
- సిరీస్ 2-1తో ఆస్ట్రేలియా కైవసం

8

అదానీ కోసం ఎల్‌ఐసి బలి..!



పెట్టుబడుల పేరుతో రూ.33 వేల కోట్లు తరలింపునకు ప్రణాళిక

- బీమా సంస్థపై మోడీ సర్కార్ ఒత్తిడి
- మేలో 5 వేల కోట్ల షేర్ల కొనుగోలు
- వాషింగ్టన్ పోస్ట్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశ ప్రజల కష్టార్జితంతో ఎదిగిన ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ ఎల్‌ఐసిని అదానీ ప్రయోజనాల కోసం నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బలిపెడుతోందా? దేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది పాలసీదారులను అదానీ వ్యాపారకాంక్షకు సమిధలుగా మార్చుతోందా, సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్‌ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదాని గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్ళించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందా? ఈ ప్రశ్నలన్నింటికీ 'అవును' అన్నదే 'వాషింగ్టన్ పోస్ట్' సమాధానం! అమెరికా రాజధాని వాషింగ్టన్ నుండి వెలువడే ఈ ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఈ మేరకు ప్రచురించిన కథనం ఇప్పుడు దేశ రాజకీయాల్లో కలకలం రేపింది. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానికి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు (33 వేల కోట్ల రూపాయలను) అదాని గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని ఆ వార్తా కథనంలో పేర్కొన్నారు. ఈ మేరకు అత్యున్నత అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్రణాళికను రూపొందించి, ముందుకు తీసుకెళ్లారనిపేర్కొంది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా అధికారులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించింది' అని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్‌ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది.

అదాని పోర్టులకు 5వేల కోట్లు

దీనిలో భాగంగానే అదాని పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,000 కోట్లు) బాండ్లను ఎల్‌ఐసి కొనుగోలు చేసిందని వాషింగ్టన్ పోస్టు తెలిపింది. 'అదాని పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నతస్థాయిలో ఎల్‌ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైంది. ఆ వెంటనే మే 30వ తేదిన ఒకేఒక పెట్టుబడిదారుడు అదాని పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను కొనేశాడు. ఆ పెట్టుబడిదారుడు మరెవ్వరో కాదు...ఎల్‌ఐసినే అని ఆ కథనంలో పేర్కొన్నారు. 'అత్యంత ధనవంతుడు. రాజకీయంగా కేంద్ర ప్రభుత్వానికి బాగా అనుసంధానించబడిన బిలియనీర్‌కు చెందిన సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న పన్నుచెల్లింపుదారుల డబ్బును మళ్లించడానికి ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన అతిపెద్ద ప్రణాళికలో ఇది ఒక భాగం.' అని ఆ పత్రిక వ్యాఖ్యానించింది,' అదానీకి ఈ ప్రభుత్వం ఎలాంటి హాని, నష్టాన్ని జరగనివ్వదు. అదానీ వ్యాపార సామ్రాజ్యానికి అనుకూలంగా వ్యవహరిస్తోంది. అదానీ వ్యాపారాలను దేశ ఆర్థిక విజయాలుగా మోడీ సర్కార్ భావిస్తోంది." అని కార్పొరేట్ ఫైనాన్స్ నిపుణుడు హేమీంద్ర హజారీ చేసిన వ్యాఖ్యను కూడా ఆ సంస్థ ప్రచురించింది.

అదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో న్యూయార్క్ కేంద్రంగా పని చేసిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజా నిధుల వినియోగంలో జవాబుదారీతనం అవసరమని విమర్శకులు డిమాండ్ చేస్తున్నారు..

ఎవరి ఒత్తిళ్లు లేవు : ఎల్‌ఐసి

అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిడిలు లేవని ఎల్‌ఐసి పేర్కొంది. తమది స్వతంత్ర నిర్ణయమని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రభుత్వ అధికారుల నుంచి ప్రణాళిక మేరకే ఎల్‌ఐసి భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టిందనే ఆరోపణలు నిరాధారమని పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని తెలిపింది.

పిఎసితో విచారణ జరపాలి : కాంగ్రెస్ డిమాండ్

అదానీ కంపెనీల్లో బలవంతంగా ఎల్‌ఐసితో పెట్టుబడులకు ఒత్తిడి చేయడాన్ని కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. అదానీ గ్రూప్ ప్రయోజనాల కోసం ఎల్‌ఐసి పాలసీదారుల పొదుపును వాడుకున్నారని ఆరోపించింది. సామాన్య ప్రజల జీవితకాల పొదుపులను ఒక ప్రయివేటు కంపెనీకి లబ్ధి చేకూర్చేలా దుర్వినియోగం చేశారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ గ్రూప్‌లో రూ.33 వేల కోట్ల ఎల్‌ఐసి నిధులను పెట్టుబడి పెట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వచ్చిన వ్యవహారంపై పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముంచుకొస్తున్న 'మొంథా'

- 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం
- తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు!
- అధికారులు అప్రమత్తం : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న 'మొంథా' తుపాను ఈ నెల 28న కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 26 నుంచి తుపాను ప్రభావం కనిపిస్తుందని, అదే సమయంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు దీని ప్రభావం ఉండనుంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ దిశగా కదిలి వాయుగుండంగా మారింది. అండమాన్ దీవులకు పశ్చిమ-నైరుతి దిశలో దాదాపు 440 కిలోమీటర్ల దూరంలో.. విశాఖపట్నానికి ఆగ్నేయంగా 970 కిలోమీటర్ల దూరంలో.. చెన్నైకు తూర్పు-ఆగ్నేయంగా 970 కిలోమీటర్ల దూరంలో.. కాకినాడకు ఆగ్నేయంగా 990 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది దాదాపు వాయువ్య దిశగా కదులుతూ 27న ఉదయానికి నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతం మీదుగా తుపానుగా బలపడే అవకాశం ఉంది. తరువాత ఇది వాయువ్య దిశగా.. ఆ తర్వాత ఉత్తర- వాయువ్య దిశగా ప్రయాణించి.. 28న ఉదయానికి తీవ్ర తుపానుగా బలపడే అకాశం ఉంది.

ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు : సిఎం చంద్రబాబు

అధికారులు, కలెక్టర్లు, ఎస్‌పిలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు అప్రమత్తమవ్వాలని, ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలకు తుపానుపై అవగాహన కల్పించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అవసరమైతే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలన్నారు. అన్ని ప్రధాన, మధ్య తరహా రిజర్వాయర్లలో నీటి మట్టాలను పర్యవేక్షించి, నీటి విడుదల శాస్త్రీయంగా జరిగేలా చూడాలని చెప్పారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించి తుపాను నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

అలాగే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, సిఎస్ విజయానంద్ వేర్వేరుగా జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్.. కాకినాడ కలెక్టరుకు పలు సూచనలు చేశారు. షెల్టర్లలో ఆహారం, మందులు, పాలు వంటివన్నీ సమకూర్చాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని మిగతా 7లో



ఆందోళనకారులతో మాట్లాడుతున్న స్వప్నిల్ జగన్నాథ్

హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-సీతంపేట

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మండంగి కవిత శుక్రవారం కెజిహెచ్‌లో అనారోగ్యంతో మరణించింది. బాలిక మరణానికి పాఠశాల యాజమాన్యమే కారణమంటూ మృతదేహంతో డొంబంగివలస గ్రామస్తులు శనివారం పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు ఎం. తిరుపతిరావు మాట్లాడుతూ... పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందారని, మృతురాలి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆందోళన వద్దకు వచ్చిన ఐటిడిఎ ఎపిఒ స్వప్నిల్ జగన్నాథ్ స్పందిస్తూ... మృతురాలి కుటుంబానికి మెరుగైన జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

మంత్రి ఇలాకాలో కంచాలు కరువు!

- ఇద్దరు విద్యార్థులకు ఒకటే పళ్లెం
- భోజనాలు చేసే చోటే కుక్కలు
- 'మన్యం' జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో హృదయ విదారక దుస్థితి

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ రకరకాల వ్యాధులతో హాస్టల్ విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్న దుస్థితి కళ్లముందే కనపడుతోంది. జ్వరాలు వెంటాడుతున్నాయి. పౌష్టికాహార లోపంతో చిన్నారులు కునారిల్లుతున్నారు. హాస్టళ్లలోని వసతుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది! ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని హాస్టళ్లలో నెలకొన్న దయనీయ పరిస్థితులపై 'ప్రజాశక్తి' వరుస కథనాలను ప్రచురించనుంది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లా పార్వతీపురం మన్యం జిల్లా మన్యంలో హాస్టల్ విద్యార్థుల కన్నీటి వెతలపై క్షేత్రస్థాయి పరిశీలన ఇది!



సాలూరు మండలం తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇదీ దుస్థితి

కె. రమేష్ నాయుడు

పోషక విలువలు లేని తిండి. ఒకే పళ్లెంలో ఏకకాలంలో ఇద్దరేసి చొప్పున తినాల్సిన దుస్థితి. కటిక నేలపై నిద్రించాల్సిన పరిస్థితి. మిర్చి, పోపు కూడా లేకుండా చేసిన నీళ్ల చారు. గుడ్డును పసుపు నీటిలో ఉడకబెట్టి కలరింగ్! తినడానికి కనీస వసతి లేకపోవడంతో ఆరుబయటే కుక్కలతో కలిసి భోజనాలు... ఇవి గిరిజనశాఖ మంత్రి సొంత నియోజకవర్గమైన సాలూరు పరిధిలోని తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కనిపించిన దృశ్యాలు.



ఒకే కంచంలో అన్నం తింటున్న విద్యార్థులు


శిథిలావస్థలో ఉన్న భవనంలో తినడానికి భయపడి ఆరుబయటే విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వర్షం పడి బురదతో నిండి ఉన్నా అక్కడే భోజనాలు చేయకతప్పని స్థితి వారిది! ఈ నెల 23వ తేదీ ప్రజాశక్తి ఆ హాస్టల్‌కు వెళ్లినప్పుడు బురదలోనే కొందరు మోకాళ్లపై కూర్చుని తినడం కనిపించింది. అంతకన్నా ఒకే ప్లేట్‌లో ఇద్దరేసి విద్యార్థులు తింటున్న దృశ్యం విస్మయం కలిగిస్తుంది. ఎక్కువ మంది విద్యార్థులు ఇలాగే తింటున్నారు. 'ఇదేమిటి' అని విద్యార్థులను ప్రశ్నిస్తే 'పళ్లేలు లేవు' అని జవాబిచ్చారు! ఒకవైపు విద్యార్థుల సంక్షేమం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నామంటూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా కంచాలు కొనడానికి నిధులు లేని దుస్థితి ఏమిటో అర్థం కాదు. ఆ రోజు వారికి చారు, గుడ్డు మాత్రమే పెట్టారు! చారంటే దాదాపుగా ఉత్త నీరే! అందులో ఉల్లి, మిగతా 7లో

రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతోనే ప్రమాదం

కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద వేమూరి కావేరి ప్రైవేట్ బస్సు దగ్ధమైన ఘటనలో పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బస్సు దగ్ధం ఘటనలో 19 మంది సజీవ దహనం కావడం, ద్విచక్ర వాహనదారుడు శివశంకర్ మృతి చెందడం తెలిసిందే. వెళ్తున్న బైక్‌ను బస్ ఢీకొట్టలేదని, రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన కర్నూలులో వెల్లడించారు. దీని ప్రకారం... ఈ ద్విచక్ర వాహనాన్ని శివశంకర్ డ్రైవ్ చేస్తుండగా, వెనకాల ఎర్రి స్వామి అలియాస్ నాని కూర్చున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో, స్వామిని పలు కోణాల్లో విచారించారు. లక్ష్మీపురం గ్రామం నుండి అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు రెండు గంటలకు వీరిద్దరూ బయలుదేరారు. స్వామిని ఇంటివద్ద వదలడానికి తుగ్గలికి పల్సర్ బైక్‌పై శివశంకర్ తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో కియా షోరూం వద్దగల హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద అర్ధరాత్రి సుమారు 2.24 గంటల సమయంలో రూ.300 పెట్రోలు వేయించుకున్నారు. ఆ తర్వాత బయలుదేరిని కొద్దిసేపటికి చిన్నటేకూరు సమీపంలో బైక్ స్కిడ్ అయింది, దీంతో, రోడ్డుకు కుడిపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో బైక్‌ను నడుపుతున్న శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ వెనకాల ఉన్న స్వామి చిన్న గాయాలతో బయటపడ్డారు. ప్రమాద ఘటనా స్థలం దగ్గర రోడ్డు మధ్యలో నుండి శివశంకర్‌ను స్వామి బయటకు లాగి శ్వాస చూసి చనిపోయాడని నిర్ధారించుకునేలోపే, రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను తీద్దామనుకునే సమయంలోనే ఈ బైక్‌ను కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో స్వామి బయపడి తన సొంతూరు తుగ్గలికి వెళ్లిపోయారు. ఈ ప్రమాదంపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారని, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నామని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు.



ప్రమాదానికి ముందు ద్విచక్రవాహనానికి పెట్రోలు కొట్టించేందుకు బంక్‌కు వచ్చిన శివశంకర్, ఆయన వెనుక స్వామి

'అలిపిరి' నుంచే ప్రారంభం

- విద్యుత్తు బస్సులతో ఆర్‌టిసి ఉద్యోగుల ఉపాధికి ఎసరు
- డిపోలు ప్రైవేట్‌పరం!

హైదరాబాద్‌లో కాల్పుల కలకలం


- దొంగలను వెంబడించిన డిసిపి
- కత్తితో దాడికి యత్నించిన దుండగులు
- మూడు రౌండ్లు కాల్పులు జరిపిన డిసిపి

2లో

బల్క్ డ్రగ్ ప్రాజెక్టు విరమించుకోండి

- రాజయ్యపేట మత్స్యకారుల అభ్యంతరాలు సమంజసమైనవి
- ప్రజల జీవితాలకు హాని కలిగినా ప్రభుత్వానికి పట్టదా?
- రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



ప్రజలకు నష్టం చేకూర్చే బల్క్ డ్రగ్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఏర్పాటు చేయదలచిన బల్క్ డ్రగ్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఉద్యమిస్తున్నారని, వారి అభ్యంతరాలు సమంజసమైనవని తెలిపారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ కంపెనీ నుంచి వెదజల్లుతున్న కాలుష్యంపై అక్కడి ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, దీంతో, వారు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ప్రధాన మంత్రి... బల్క్ డ్రగ్స్ ప్రాజెక్ట్ ఆవిష్కరణ చేసిన సందర్భంలో అటువంటి ప్రాజెక్టుల వల్ల కలిగే కాలుష్య సమస్యలపై తాను హెచ్చరించినట్టు శర్మ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి కొంత మంది స్థానికులు ప్రయత్నం చేసినప్పుడు అధికారులు బలప్రయోగం చేసి వారిని అడ్డుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, అదే రోజున ప్రజలందరికీ ఆ విధంగా అభ్యంతరాలు వ్యక్తపరిచే హక్కు అక్కడి వారికి ఉందని తాను గుర్తు చేశానని పేర్కొన్నారు. నక్కపల్లి ప్రాంతంలో ప్రజలు, ముఖ్యంగా మత్స్య కారుల జీవితాలకు హాని కలిగించే ప్రాజెక్టుల విషయంలో రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ కింద వారి ఉద్దేశాలను, అభ్యంతరాలను వ్యక్తపరిచే మిగతా 7లో

ఇజ్రాయిల్‌కు 'సౌకర్యం'గా ఉన్న దేశాలతోనే... అంతర్జాతీయ భద్రతా దళం ఏర్పాటుపై అమెరికా

జెరుసలేం : ఇజ్రాయిల్‌కు 'సౌకర్యవంతంగా' ఉన్న దేశాలతోనే గాజాలో అంతర్జాతీయ భద్రతాదళం ఏర్పాటవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. భవిష్యత్తులో గాజాలో పాలన ఎలా ఉండాలన్న అంశంపై ఇజ్రాయిల్, భాగస్వామ్య దేశాలతో కసరత్తు జరపాల్సి ఉన్నదని ఇజ్రాయిల్‌లో పర్యటిస్తున్న రుబియో శుక్రవారం తెలిపారు. ఈ విషయంలో హమాస్‌కు ఎలాంటి ప్రమేయం ఉండబోదని స్పష్టం చేశారు. పాలస్తీనా అథారిటీ పాత్రను నిర్ధారించాల్సి ఉన్నదని తెలిపారు. దక్షిణ ఇజ్రాయిల్‌లోని పౌర-సైనిక సమన్వయ కేంద్రాన్ని రుబియో సందర్శించి అమెరికా సైనిక సిబ్బందితో మాట్లాడారు.

గాజాలో కాల్పుల విరమణ అమలును అమెరికా దళాలు పరిశీలిస్తున్నాయి. అక్కడ పరిస్థితులను చక్కదిద్దేందుకు అంతర్జాతీయ దళాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాయి. సుశిక్షితులైన 200 దళాలు కాల్పుల విరమణను పర్యవేక్షిస్తున్నాయని, గాజాకు సహాయ సామగ్రి చేరేందుకు సాయపడుతున్నాయని, అక్కడ భద్రతాపరమైన సాయాన్ని అందిస్తున్నాయని అమెరికా సైన్యం ప్రకటించింది. గాజాకు ఈశాన్యంగా ఉన్న కిర్యత్ గాట్ నగరంలోని ఓ బిజినెస్ పార్కు నుంచి పౌర-సైనిక సమన్వయ కేంద్రం పనిచేస్తోంది. తన సైనికులను గాజాకు పంపబోనని స్పష్టం చేసిన అమెరికా... ఈజిప్ట్, ఇండోనేషియా, గల్ఫ్ దేశాల నుంచి దళాలను రప్పిస్తోంది. దళాలను పంపేందుకు అరబ్, ఇతర దేశాలు సంసిద్ధత తెలుపుతాయా అనేది తెలియడం లేదు. నిరాయుధీకరణకు హమాస్ ఇంకా అంగీకరించలేదు. అంతర్జాతీయ దళాల మోహరింపు సున్నితమైన అంశమని, దానిపై చర్చలు జరగాల్సి ఉన్నదని హమాస్ చెబుతోంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కారును ఢీకొట్టిన కంటైనర్.. మంత్రికి తప్పిన ప్రమాదం

లక్నో : ఉత్తరప్రదేశ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి బేబి రాణి మౌర్యకు పెను ప్రమాదం తప్పింది. ఆగ్రా - లక్నో ఎక్స్‌ప్రెస్ వేపై ఆమె ప్రయాణిస్తున్న కారును ఓ కంటైనర్ ఢీకొట్టింది. కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి గాయాలు లేకుండా ఆమె క్షేమంగా బయటపడ్డారు. హత్రాస్ జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. శుక్రవారం రాత్రి లక్నోకు పయణమయ్యారు. ఈ క్రమంలో ఫిరోజాబాద్ జిల్లాలో జాతీయ రహదారిపై నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో రెండు వైపులా వాహనాలను ఒకే మార్గం గుండా దారిమళ్లించారు. దీంతో ఆమె కారు ముందు వెళ్తున్న కంటైనర్ టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. వాహనంపై డ్రైవర్ పట్టు కోల్పోవడంతో అది అదుపుతప్పి మంత్రి కారుపైకి దూసుకొచ్చింది. అప్రమత్తమైన డ్రైవర్ కారు పక్కకు తీసుకెళ్లాడు. దీంతో కారు కుడివైపు స్వల్పంగా ధ్వంసమైంది. మంత్రికి ఎలాంటి ముప్పు వాటిల్లకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ను పోలీసులు సీజ్ చేశారు.

'అలిపిరి' నుంచే ప్రారంభం

● విద్యుత్తు బస్సులతో ఆర్‌టిసి ఉద్యోగుల ఉపాధికి ఎసరు ● డిపోలు ప్రైవేట్‌పరం!

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఎపి ఆర్‌టిసిని ప్రైవేట్ వారి పెత్తనంలోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. తిరుపతిలోని అలిపిరి డిపో నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించాలని చూస్తోంది. ఇప్పటికే ఈ డిపోకు వంద ఎలక్ట్రికల్ బస్సులు వచ్చాయి. వీటిని ఈ డిపో నుంచే ఆర్‌టిసి రూట్లలో తిప్పుతున్నారు. వీటిని నిర్వహణ బాధ్యతను లీజు పద్ధతిలో మెగా అనే సంస్థకు ఆర్‌టిసి అప్పగించింది. దీంతో, ఎలక్ట్రికల్ బస్సులను ఆ సంస్థ ప్రైవేట్ డ్రైవర్లతో నడుపుతుండడంతో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ, ఇతర సిబ్బందిపై తీవ్ర ప్రభావం పడింది. పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యుత్ ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చామనే పేరుతో త్వరలోనే ఆ డిపోలోని వారిని పక్క డిపోలైన తిరుపతి, మంగళం, తిరుమల డిపోలకు బదిలీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం ఐదు వేలు ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేసి వాటిని రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పద్ధతితో ప్రైవేట్ వారికి అప్పగించనున్నారు. త్వరలో మరో 300 ఎలక్రికల్ బస్సులు రానున్నాయి. వీటిలో కొన్నింటిని తిరుపతి జిల్లా మంగళం డిపో నుంచి కేటాయించనున్నారు. ఇక్కడా కూడా ఇదే విధానాన్ని అవలంభించనున్నారు. దీంతో, ఇక్కడి ఆర్‌టిసి సిబ్బందిపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ఒక ఎలక్ట్రికల్ బస్సు వల్ల ఐదుగురి ఆర్‌టిసి సిబ్బంది ఉపాధికి గండిపడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 131 ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. వాటిలో 65 వేల మంది పనిచేస్తున్నారు. 11,495 బస్సులతో 14,123 గ్రామాలకు ఎపిఎస్‌ఆర్‌టిసి సేవలను అందిస్తోంది. 1,423 రూట్లలో రోజుకు 39.15 లక్షల కిలోమీటర్లతో 38 లక్షల మందికి ప్రయాణ సౌకర్యం


అలిపిరి ఆర్‌టిసి బస్టాండ్‌లో ఎలక్ట్రికల్ బస్సు

కల్పిస్తోంది. రోజుకు రూ.15.86 కోట్ల ఆదాయం వస్తోంది. కేంద్ర ప్రభుత్వం సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ రవాణా రంగాన్ని ప్రైవేట్‌పరం చేయాలన్నది లక్ష్యం. అందుకు అనుగుణంగా ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చి వాటి నిర్వహణ భారాన్ని ప్రైవేట్ వారికి అప్పగిస్తున్నారు. ఈ సర్వీసులను పెంచుతూ ఆర్‌టిసిని క్రమంగా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిఒ 88 ప్రకారం 2029 నాటికి రాష్ట్రంలోని 31 డిపోల్లో ఈ విధానాన్ని అమలు చేయనుంది. దీంతో, ఆర్‌టిసి డిపోల కేంద్రంగా ప్రైవేట్ వారి నిర్వహణలో ఆర్‌టిసి రూట్లలో ఎలక్ట్రికల్ బస్సులు తిరగనున్నాయి. డిపో మొత్తం ప్రైవేట్ యంత్రాంగంతో నిండనుంది. విజయవాడ జోన్‌లోని విద్యాధరపురం, రాజమండ్రి, కాకినాడ, మంగళగిరి, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి (మంగళం) తదితర డిపోల్లోనూ ఇదే విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ డిపోల్లో ఇప్పటికే ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. లాభాల రూట్లన్నీ ప్రైవేట్‌పరం అయిపోతాయి.

'కార్పొరేట్'కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నాం



ఎలక్ట్రికల్ బస్సులకు మా సంఘం వ్యతిరేకం కాదు. అయితే, ఈ బస్సులను కార్పొరేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ సాకు చూపి ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేస్తోంది. ప్రైవేట్ ఆపరేటర్లకు లాభాపేక్షే తప్ప, ప్రయాణికుల భద్రత పట్టదు. కర్నూలులో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదమే ఇందుకు నిదర్శనం. ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం కాబట్టి ఎలక్ట్రికల్ బస్సుల స్థానంలో ఆర్‌టిసి సర్వీసులను కొనుగోలు చేయాలి. ఒక ఎలక్ట్రికల్ బస్సుకు వెచ్చించే మొత్తంతో ఐదు సూపర్ లగ్జరీ బస్సులు లేదా ఆరేడు ఎక్స్‌ప్రెస్ బస్సులను కొనుగోలు చేయవచ్చు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించవచ్చు. ఆర్‌టిసి నిర్వీర్యాన్ని నిరసిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెన్నయ్‌లో నవంబర్ 23న జాతీయ స్థాయి సదస్సు జరగనుంది.

-సిహెచ్ సుందరయ్య,
ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

- **దొంగలను వెంబడించిన డిసిపి**
- **కత్తితో దాడికి యత్నించిన దుండగులు**
- **మూడు రౌండ్ల కాల్పులు జరిపిన డిసిపి**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని చాదర్‌ఘాట్‌లోని విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. సిపి సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం పాతబస్తీ కామాటిపురా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్- మొబైల్ స్నాచర్ మహ్మద్ ఓమర్ అన్సారీ, మరో నిందితుడు కలిసి సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్నారు. అదే సమయంలో హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్య సీపీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌కు వెళ్లి తిరిగి తన కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో పారిపోతున్న ఇద్దరు దొంగలను గన్‌మెన్ గమనించారు. ఆ దొంగలను డిసిపి పట్టుకునేందుకు ప్రయత్నించారు. తప్పించుకునే ప్రయత్నంలో డిసిపి, అతని గన్‌మెన్‌పై చైన్ స్నాచర్లు కత్తితో దాడికి దిగారు. ఈ క్రమంలో గన్‌మెన్ పడిపోయాడు. కత్తితో బెదిరిస్తూనే ఓ దొంగ ఛాదర్‌ఘాట్ సమీపంలోని ఇసామియా బజార్ టెలివిజన్ గల్లీలోకి వెళ్లాడు. అక్కడి నుంచి బయటపడేందుకు దారి లేకపోవడంతో ఓ భవనంపైకి ఎక్కి వెనుక భాగంలో ఉన్న విక్టోరియా ప్లే గ్రౌండ్‌లోకి దూకే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన డిసిపి గన్ తీసుకొని రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. నిందితుడు ఓమర్ అన్సార్ భుజం, కడుపులో బుల్లెట్లు తగిలాయి. కాగా, మరొక మొబైల్


కాల్పుల్లో గాయపడ్డ ఓమర్

స్నాచర్ తప్పించుకున్నాడు. ఈ దాడిలో డిసిపి మెడ, కాలి భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. గన్‌మెన్ కింద పడిపోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. చాదర్‌ఘాట్‌లో కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని సిపి సజ్జనార్ తెలిపారు. ఆత్మరక్షణలో భాగంగానే దొంగలపై డిసిపి కాల్పులు జరిపారని, కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారని తెలిపారు. ఓమర్‌పై కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదుకాగా, సెల్‌ఫోన్ల చోరీ కేసులతోపాటు 25 కేసులలో నిందితుడు అని తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చినప్పటికీ ఓమర్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు.

ఢిల్లీలో మరో ఎన్‌కౌంటర్..

- **పోలీసుల అదుపులో క్రిమినల్ కోకు పహాడియా**

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని మెహ్రౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఉదయం 4 గంటలకు పోలీసులకు-వాంటెడ్ క్రిమినల్ కోకు పహాడియా మధ్య కాల్పులు జరిగాయి. నేరస్థుడు జరిపిన కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ రవీంద్రకు గాయాలు కాగా.. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లను ధరించిన మరో ఇద్దరు పోలీసులకు ప్రమాదం తప్పింది. ఎట్టకేలకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎదురుకాల్పుల్లో పహాడియాకు గాయాలు కావడంతో చికిత్స కోసం పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

అయితే అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఆయుధ సరఫరాతో పాటు అనేక కేసుల్లో పహాడియా వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నారు. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

స్టీల్ పిఎస్‌యులను విలీనం చేయాలి

- **వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నిర్దిష్ట ఆందోళనలు**
- **ఎస్‌ఇఎఫ్‌ఐ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థలను విలీనం చేయాలని స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఇఎఫ్‌ఐ) డిమాండ్ చేసింది. శనివారం నాడిక్కడ సెయిల్ కార్యాలయం అయిన ఎస్‌సిఒపిఇ మినార్‌లో స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సెయిల్, ఆర్‌ఐఎన్‌ఎల్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్), ఎన్‌ఎమ్‌డిసి, ఎఐసిఒఎన్‌తోపాటు ఇతర స్టీల్ అధికారుల సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఆర్‌ఐఎన్‌ఎల్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్) స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ (ఎస్‌ఇఎ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం ఎస్‌ఎస్ చంద్రరావు, కెవిడి ప్రసాద్, ఉపాధ్యక్షులు టి శ్రీనివాసరావు కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఉద్యోగోన్నతులు, గ్రాట్యూటీ


ఎస్‌ఇఎఫ్‌ఐ కౌన్సిల్ సమావేశంలో అధికారులు, సంఘాల నాయకులు

పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు, స్టీల్ పిఎస్‌యుల విలీనం, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సంబంధించిన నిర్దిష్ట ఆందోళనలపై చర్చించారు. ఈ సందర్భంగా నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్స్ (ఎన్‌సిఒఎ), ఎస్‌ఇఎలకు చేసిన అంకితభావ సేవలను ప్రశంసిస్తూ ఎస్‌ఇఎ అధ్యక్షులు కాటం ఎస్‌ఎస్ చంద్రరావును ఎస్‌ఇఎఫ్‌ఐ కౌన్సిల్ సత్కరించింది. ఎస్‌ఇఎఫ్‌ఐ ఛైర్మన్, ఎన్‌సిఒఎ అధ్యక్షులు ఎన్‌కె బంచోర్, ఎస్‌ఇఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి సంజయ్ ఆర్య, సీనియర్ కౌన్సిల్ సభ్యులు ఎకె సింగ్ ఇతర సభ్యులు హాజరయ్యారు.

కారుణ్య మరణానికి అవకాశం ఇవ్వండి

● రాయపూడికి చెందిన వృద్ధురాలు హైకోర్టులో పిటిషన్ ● భూమి తీసుకుని ఖాళీ చేయాలని సిఆర్‌డిఎ ఒత్తిడి ● విచారణకు వారం రోజులు వాయిదా ● వృద్ధుల సంరక్షణ కేంద్రాలు లేవని కోర్టుకు తెలిపిన ఎజి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణం కోసం చేపట్టిన భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)లో తనకున్న ఐదు సెంట్లు ఇంటి స్థలాన్ని తీసుకున్న అధికారులు ప్రత్యామ్నాయ భూమి ఇవ్వకుండానే.. ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, ఈ సమయంలో తనకు వేరేమార్గం లేదని కారుణ్యమరణానికి అవకాశం ఇవ్వాలని గుంటూరు జిల్లా రాయపూడి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆమె పిటీషన్‌ను విచారణకు స్వీకరించి 29253 నెంబరు కేటాయించింది. దీనిపై పిటీషన్ దాఖలు చేసిన ఆమె తరుపు న్యాయవాది మీడియాతో మాట్లాడారు. రాయపూడికి చెందిన నెల్లూరు శేషగిరిమ్మకు గతంలో ఎకరంన్నర భూమి ఉందని తెలిపారు. దీనిలో 1.45 సెంట్ల భూమిని ప్రభుత్వం మత్స్యకారులకు కేటాయించింది. మిగిలిన ఐదుసెంట్ల భూమిలో ఆమె నివాసం ఉంటోంది. శేషగిరిమ్మకు కూతురు అనారోగ్యంతో మంచంలోనే ఉంటోంది. మనుమరాలు మతిస్థిమితం లేనిస్థితిలో ఉంది. వారికొచ్చే పెన్షన్‌తోనే జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా సిఆర్‌డిఏ అధికారులు ఇంటిని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అయితే తనకు భూమి ఇవ్వాలని ఆమె కోరారు. దీనికి అధికారులు నిరాకరించారు. పూలింగు నిబంధనల ప్రకారం 50 గజాలు మాత్రమే వస్తుందని, అయితే అంత ప్లాట్లు లేవని, గనుక టిడిఆర్ బాండు ఇస్తామని తెలిపారు. ఈ వయస్సుతో తాను బాండును ఏమి చేసుకోవాలో అర్థం కావడం లేదని, పెన్షన్‌తో బతకడం తప్ప మరోఆదాయం లేదని తెలిపారు. వృద్ధాప్యంలో తాను ఎక్కడకు వెళ్లలేనిస్థితిలో కూతురు, మనుమరాలిని చూసుకుంటూ బతుకుతున్నానని తెలిపారు.

అయితే తనకు భూమి ఇవ్వాలని, లేదా కారుణ్యమరణానికి అవకాశం ఇవ్వాలని గతనెల 12 వతేదీన శేషగిరిమ్మ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం సమర్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తనను గతంలో అధికారులు వచ్చి పూలింగుకు ఇవ్వాలని, అంతే విస్తీర్ణం భూమిని ఇస్తామని చెబితేనే తాను నమ్మి పూలింగుకు ఇచ్చానని తెలిపారు. ఇప్పుడు భూమి ఇవ్వబోమంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వచ్చే పెన్షన్ కూడా మందులకే సరిపోతోందని అందులో ప్రస్తావించారు.

దీంతోపాటు పలుమార్లు ప్రజాసమస్యల పరిష్కారవేదికలోనూ ఫిర్యాదు చేశారు. ఎండిఓ వచ్చి విచారించి తమ పరిధిలో లేదని చెప్పారు. సిఆర్‌డిఏ అధికారులు భూమి ఇవ్వబోమని చెప్పడంతో ఆమె కారుణ్యమరణానికి అవకాశం ఇవ్వాలని కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ఏజిని వివరణ కోరగా వృద్ధులకు హాస్టళ్లు, నివాస సదుపాయాలు తమ పరిధిలో లేవని, వారం రోజులు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి హైకోర్టు అంగీకరించి విచారణను ఈనెల 31వ తేదీకి వాయిదా వేసింది. పూలింగు ప్రక్రియ మొదలైన తరువాత దాఖలైన ఈ కేసు ఇప్పుడు సంచలనం అయింది.



ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లకు వేధింపులు..

ఇండోర్ : భారత్‌లో జరుగుతున్న మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌లో పాల్గొటానికి వచ్చిన ఆస్ట్రేలియా క్రీడాకారులను వేధించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఇండోర్‌లోని ఖజ్రానా రోడ్డులోని ఓ కేఫ్‌కు నడుచుకుంటూ వెళ్లిన ఇద్దరు మహిళా క్రీడాకారులను మోటర్ సైకిల్‌పై వచ్చిన అకిల్ ఖాన్ అనుచితంగా తాకి వేధించాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే వారు భద్రతా సిబ్బందికి సమాచారం అందించగా, ఆస్ట్రేలియా టీం మేనేజర్ డాని సిమ్మన్స్ ఎంఐజి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆస్ట్రేలియా క్రికెట్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. తమ ఇద్దరు క్రికెటర్లను మోటార్ వెహికల్‌పై వచ్చిన వ్యక్తి అనుచితంగా తాకి వేధించాడని సిఎ ధ్రువీకరించింది. ఈ సంఘటనను బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించారు. ఇది జరిగి ఉండాల్సింది కాదన్నారు. భారతదేశం ఆతిథ్యానికి, సంరక్షణకు ప్రసిద్ధి చెందిందన్నారు. నిందితుడిని పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. భద్రతా ప్రోటోకాల్‌ను సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని శనివారం మీడియాకు తెలిపారు. మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ దీనిపై ఒక ప్రకటన విడుదల చేసింది. ఆస్ట్రేలియా క్రికెటర్లకు క్షమాపణలు చెప్పింది. భద్రతకు, ఆతిథ్యానికి పేరుగాంచిన నగరంలో ఇటువంటి సంఘటన జరగటం దురదృష్టకరమని, వారు క్షమించాలని ప్రకటనలో కోరింది.



హైదరాబాద్‌లో ఇ-బస్ బోల్తా

- **పలువురికి తీవ్ర గాయాలు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మియాపూర్ నుంచి గుంటూరుకు బయలుదేరిన ఎలక్ట్రికల్ బస్సు (ఇ-బస్) రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట ఒఆర్‌ఆర్ వద్ద బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... 'న్యూగో' సంస్థకు చెందిన ఈ బస్సు పెద్ద అంబర్‌పేట ఒఆర్‌ఆర్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తా పడింది. బస్సులో ఉన్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురు ప్రయాణికులను హయత్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి, మరో ఇద్దరిని, ఇద్దరు డ్రైవర్లు, కండక్టర్‌ను కంచన్‌బాగ్‌లోని అపోలో (డిఆర్‌డిఒ) ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సులో పొగలు

ప్రజాశక్తి- నందిగామ : విజయవాడ నుంచి కోదాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సులో శనివారం సాయంత్రం పొగలు వ్యాపించాయి. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి జాతీయ రహదారి పక్కన బస్సు నిలిపివేశారు. ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. ఇంజన్లక ఆయిల్ లీకవ్వడం వల్ల పొగలు వ్యాపించాయని డ్రైవర్ తెలిపారు.

ఎంపిసి రిపోర్ట్‌లను తస్కరిస్తోన్న ఎకోవ్రాప్ రీసెర్చ్

- **ఆర్‌బిఐ ఎకనామిస్ట్ ఆరోపణ**
- **సంచలనం కోసమే ఆరోపణలు : ఎస్‌బిఐ రీసెర్చ్**



న్యూఢిల్లీ : ఆర్థిక విధానాల్లో కీలక చర్చలకు వేదిక కావాల్సిన ఆర్‌బిఐ, ఎస్‌బిఐ నిపుణుల మధ్య ఘర్షణ నెలకొంది. ఆర్‌బిఐ మానిటరీ పాలసీ రిపోర్టులను ఎలాంటి క్రెడిట్ ఇవ్వకుండానే ఎస్‌బిఐ పరిశోధకులు చౌర్యానికి పాల్పడుతున్నారని సెంట్రల్ బ్యాంక్ ఎకనమిస్టు సార్థక్ గులాటీ తొలుత విమర్శించారు. తమ రీసెర్చ్ రిపోర్టులను ఎస్‌బిఐకి చెందిన ఎకోవ్రాప్ రీసెర్చ్ బృందం తస్కరిస్తోందని ఆరోపించారు. తమ నివేదిల్లోని కొన్ని పేరాలు, చార్టులు, ప్రజంటేషన్లు కూడా తమ నుంచి సేకరించినవేనని తెలిపారు. ఇలా తమ రిపోర్ట్ సమాచారాన్ని వాడుకుంటున్నప్పటికీ కనీసం తమకు గుర్తింపును కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పు పట్టారు. గులాటీ వ్యాఖ్యలను ఎస్‌బిఐ రీసెర్చ్ బృందం తప్పుబట్టింది. ఈ విషయం లింక్డిన్ వేదికగా చర్చకు దారి తీసింది. గులాటీ సంచలనం కోసం ఆరోపణలు చేశారని ఎస్‌బిఐ ఎకోవ్రాప్ రీసెర్చ్ హెడ్ సౌమ్యకాంతి ఘోష్ బృందం విమర్శించింది. ఈ మేరకు రీసెర్చ్ బృందం సభ్యుడు తపస్ పరిడా అదే లింక్డిన్ వేదికగా పోస్టులు పెట్టారు. తమ మెథడాలజీ పూర్తి స్వతంత్రంగా రూపొందిందని తెలిపారు. పరిశోధన నివేదికనల్లో డేటా పాయింట్ల మధ్య సారుప్యతలు ఉండడం సహజమని అన్నారు. ఈ డేటా పాయింట్లకు మూలం మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ నుంచి సేకరించిన సమాచారమేనని పేర్కొన్నారు.

భారత వృద్ధి 6.6 శాతం ఐఎంఎఫ్ అంచనా

చెన్నయ్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత వృద్ధి రేటు 6.6 శాతంగా ఉండొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ పేర్కొంది. చైనా జిడిపి 4.8 శాతం పెరగొచ్చని తెలిపింది. ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఊహించిన దానికంటే బలమైన పనితీరు నేపథ్యంలో జిడిపి అంచనాలను సవరించినట్లు పేర్కొంది. కఠినమైన ఆర్థిక పరిస్థితులు, మందగించిన వాణిజ్యం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో సహా నిరంతర ప్రపంచ ఆటంకాలు ఉన్నప్పటికీ, స్థిరమైన పన్ను వసూళ్లు, క్రెడిట్ విస్తరణ, విధాన స్థిరత్వం వృద్ధికి మద్దతును అందిస్తుందని తెలిపింది.

కొటాక్ బ్యాంక్‌కు రూ.3,253 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని కొటాక్ మహీంద్రా బ్యాంక్ 2025 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 2.7 శాతం తగ్గుదలలో రూ.3,253 కోట్ల నికర లాభాలు సాధించినట్లు తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,344 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) రూ.7,020 కోట్లుగా ఉండగా.. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో 4 శాతం పెరిగి రూ.7,020 కోట్లకు చేరింది. నికర అడ్వాన్సులు 16 శాతం వృద్ధితో రూ.4,62,688 కోట్లకు చేరాయి. 2024 ఇదే సమయం నాటికి రూ.3,99.522 కోట్ల రుణాలు నమోదయ్యాయి. సంస్థ స్థూల నిరర్థక ఆస్తులు 1.39 శాతంగా, నికర ఎన్‌పిఎలు 0.32 శాతంగా చోటు చేసుకున్నాయి.


మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాందానీ

ముస్లిం గుర్తింపును స్వీకరిస్తా : మాందానీ

న్యూయార్క్ : తన ముస్లిం గుర్తింపును బహిరంగంగా స్వీకరిస్తానని న్యూయార్క్ మేయర్ పదవికి డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జోహ్రాన్ మాందానీ స్పష్టం చేశారు. తాను జాత్యాహంకారినంటూ మాజీ గవర్నర్ ఆండ్రూ కెయోమో, ఆయన మిత్రులు తనపై చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. బ్రాంక్స్ మసీదు వెలుపల గుమిగూడిన మద్దతుదారులు, ఇమాంలు, కమ్యూనిటీ నేతలను ఉద్దేశించి మాందానీ ప్రసంగించారు. ఉగ్రవాదుల దాడి తర్వాత న్యూయార్క్‌లోని ముస్లింలు భయం, అవమానంతో ఎలా జీవిస్తున్నారో వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'సెప్టెంబర్ 11 దాడి తర్వాత ముసుగు ధరించి కనబడడం సురక్షితం కాదని భావించినందునే మా బంధువు సబ్‌వేలో ప్రయాణించడమే మానివేసింది' అని ఆయన కన్నీటిపర్యంతమవుతూ చెప్పారు. ఇలాంటి ఘటనలు నగరంలోని చాలామంది ముస్లిములకు నేర్పిన పాఠాలని తెలిపారు. ఈ పాఠాలు మాజీ గవర్నర్, ఆయన మిత్రులకు ముగింపు సందేశాలని అన్నారు. తన స్పందన రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించింది కాదని మాందానీ తెలిపారు. నగరంలోని ప్రతి ముస్లిం కనే కలను ఇతర న్యూయార్క్ వాసుల కలల మాదిరిగానే చూడాలని సూచించారు. ఏదేమైనా తన విశ్వాసాలను మార్చుకోనని మాందానీ చెప్పారు.

డెమొక్రటిక్ సోషలిస్ట్ అయిన మాందానీ నగర డెమొక్రటిక్ ప్రైమరీని గెలుచుకున్న ప్రగతిశీల అభ్యర్థులలో ఒకరు. ఇజ్రాయిల్, పాలస్తీనాలపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలపై మాజీ గవర్నర్ శిబిరం నుంచి విమర్శల దాడులు పెరగడంతో వాటిని డెమొక్రాట్లు తిప్పికొడుతున్నారు. మాజీ గవర్నర్ కెయోమో ఇస్లామోఫోబియా వైపు మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు.

డిఎన్ఎ రిపోర్టులే కీలకం

- మృతదేహాలకు నంబర్ల కేటాయింపు
- కర్నూలు జిజిహెచ్‌లో హెల్ప్‌డెస్క్



కర్నూలు జిజిహెచ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా చిన్న టేకూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో బస్సులోనే సజీవ దహనమైన 19 మంది మృతదేహాలకు ఘటనాస్థలంలోనే ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. శరీరాల సైజును బట్టి మృతులలో 17 మంది పెద్దవారు, ఇద్దరు చిన్నపిల్లలుగా గుర్తించారు. అందులో నాలుగు మృతదేహాలు స్త్రీలుగా నిర్ధారించారు. శాస్త్రీయంగా మృతదేహాలను నిర్ధారించడానికి డిఎన్ఎ టెస్ట్ ద్వారానే సాధ్యమని, 19 మృతదేహాల నుంచి బోను, మజిల్, పళ్ళు వంటి వాటిని శాంపిల్స్‌గా తీసి విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని జిజిహెచ్ ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ సాయిసుధీర్ వివరించారు. మృతుల బంధువులలో 18 మంది డిఎన్ఎ నమూనాలను ఘటనాస్థలంలోనే సేకరించారు. డిఎన్ఎ రిపోర్టులు రావడానికి 48 నుంచి 72 గంటలు సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మృతదేహాలను జిజిహెచ్ మార్చురీకి తరలించి నంబర్లు కేటాయించారు. డిఎన్ఎ రిపోర్టు వచ్చిన తరువాత బంధువుల డిఎన్ఎ, మృతుల డిఎన్ఎతో సరిపోలితే ఆ మృతదేహాలను బంధువులకు అప్పగించనున్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే కర్నూలు జిజిహెచ్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. మృతుల బంధువులు వేచి ఉండేందుకు వీలుగా కర్నూలు స్టేట్‌గెస్ట్ హౌస్‌లో సదుపాయాలు కల్పించారు.

ఈ ఘోర ప్రమాదానికి రెండు కీలక అంశాలు కారణమని ఫోరెన్సిక్ బృందాలు గుర్తించాయి. డోర్ల వద్ద ఉండే చిన్నపాటి హైడ్రాలిక్ సిలిండర్లు పేలడం, లగేజీ క్యాబిన్‌లో 400కు పైగా సెల్‌ఫోన్లు అధిక వేడికి పేలిపోవడంతో ప్రమాద తీవ్రతను పెంచాయని గుర్తించారు. ఈ రెండు కారణాలతో నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా కాలిపోయిందని, ప్రమాదం జరిగిన వెంటనే డోర్లు తెరుచుకోకపోవడం, లగేజీ క్యాబిన్‌లోని ఫోన్ బ్యాటరీలు పేలిపోవడంతో ప్రయాణికులు తప్పించుకునే మార్గం లేకుండా పోయిందని నిర్ధారణకు వచ్చారు.

పొగ పీల్చడం వల్లే మరణాలు

బస్సులో ఉన్నవాళ్లు పొగ పీల్చి ఊపిరాడక మూడు నుంచి ఐదు నిముషాలలో స్పృహ కోల్పోయి ఉండవచ్చు. బయటకు రాలేక ఆ మంటల్లో ఖాళీపోయి ఉండవచ్చు. ఎసి బయటకు పోకుండా డోర్లన్నీ మూసి ఉండడం వల్ల పొగ కూడా తీవ్ర ఇబ్బంది పెట్టవచ్చు. విమానాల్లో మాదిరిగా ప్రమాదం జరిగితే ప్రయాణికులు ఎలా తప్పించుకోవాలో ముందే అవగాహన కలిగించాలి.

- డాక్టర్ సాయి సుధీర్

సిఎండి హామీతో స్టోర్ హమాలీల దీక్షల విరమణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని స్టోర్ హమాలీల దీక్షలను విరమింపజేస్తూ...

తమ సమస్యల పరిష్కారానికి 33 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎపి ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని స్టోర్ హమాలీలు సిఎండి శివశంకర్ లోతేటి హామీతో దీక్షలను శనివారం విరమించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఆరోగ్యదాస్ తెలిపారు. స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తాము నిర్వహిస్తున్న పనుల్లోకి కాంట్రాక్టర్ల ప్రవేశాన్ని నిరోధించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ భాగస్వామ్యాన్ని పెంచాలని స్టోర్ హమాలీలు గత 33 రోజులుగా కార్పొరేట్ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం విదితమే. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఎండి తనకు విజ్ఞాపన ఇవ్వటానికి వచ్చిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జిల్లా నేత జి.బాలసుబ్రమణ్యం, స్టోర్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆరోగ్య దాస్ తదితరులతో చర్చించారు.

కిందిస్థాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానని సిఎండి తెలిపారు. స్టోర్ హమాలీలు ఇచ్చిన విజ్ఞాపన పత్రాన్ని పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిఎండి హామీతో సంతృప్తి చెందిన స్టోర్ హమాలీలు తమ నిరాహార దీక్షలను శనివారం సాయంత్రం విరమించారు. నిరాహార దీక్షా శిబిరంలో ఉన్న స్టోర్ హమాలీలకు ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ కె.గురవయ్య, జనరల్ మేనేజర్ ప్రసాద్ ఎడి జ్ఞాన ప్రకాష్ తదితర అధికారులు సిఎండి ఇచ్చిన హామీని వివరించారు. నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హమాలీ యూనియన్ నేతలు శ్రీనివాసులు, మోహన్, సుబ్బారావు, ఓబన్న, ఏసు, ఎం.శ్రీనివాస్, రాఘవయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో రాజీ తప్పలేదు

- టిటిడి పరకామణి కేసులో అప్పటి ఎవిఎస్ఒ

ప్రజాశక్తి-అమరావతి

టిటిడి పరకామణిలో చోరీ అయిన డాలర్లు (900) విలువ రూ.72 వేలు మాత్రమేనని, ఇలాంటి కేసును లోకాయుక్తలో రాజీ చేసుకోవడంలో తప్పులేదంటూ పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి (ఎవిఎస్ఒ) వై సతీష్ కుమార్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. కేసు రాజీ వెనుక దురుద్దేశాలు లేవని, దొంగతనం కేసులో తానే ఫిర్యాదుదారుడిని కాబట్టే రాజీ చేసుకున్నట్లు వివరించారు. రాజీ చేసుకోవడం చట్టబద్ధమేనని చెప్పారు. టిటిడి రూల్స్ మేరకు ఫిర్యాదు చేయడానికి, రాజీ చేసుకోవడానికి శాఖాధిపతులకు అధికారం ఉందన్నారు. ఇందుకు టిటిడి పాలక మండలి అనుమతి అక్కర్లేదన్నారు. పరకామణిలో చోరీ కేసును తిరుపతి లోకాయుక్తలో నిందితుడు రవికుమార్, సతీష్‌కుమార్ రాజీ చేసుకోవడం చెల్లదని, దీనిపై సిఐడి విచారణకు ఆదేశించాలని కోరుతూ శ్రీనివాసులు వేసిన పిటిషన్‌లో ఈ కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడాన్ని సవాల్ చేసిన కేసులో తనను కూడా ప్రతివాదిగా పరిగణించి వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలంటూ ఎపి సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.



రోడ్డు మార్జిన్ దిగి ఒరిగిన ప్రైవేట్ పాఠశాల బస్సు

ఒరిగిన ప్రైవేటు బస్సు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్ చాకచక్యంతో చిన్నారులు క్షేమం

ప్రజాశక్తి - కొండపి (ప్రకాశం జిల్లా)

కొండపిలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు శనివారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని కొండపి-అనకర్లపూడి గ్రామాల మధ్య అట్లేరు వాగు చివరి భాగంలో ప్రైవేట్ స్కూల్ బస్ మార్జిన్ దిగి ఒక పక్కకు ఒరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకొని కొండపి నుంచి అనకార్లపూడికి వెళ్తోంది. రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు అట్లేరు వాగు పొంగడంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో వాగుకు ఇరువైపులా ముళ్లకంచెను వేసి రాకపోకలు నిలిపివేశారు. శనివారం ప్రైవేటు పాఠశాల ఉండడంతో ఆ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బస్సులో వెళ్తున్నారు. అట్లేరును దాటిన తరువాత పోలీస్, రెవెన్యూ శాఖ వాహన రాకపోకలకు అడ్డుగా వేసిన ముళ్లకంచెను తప్పించే క్రమంలో బస్సు ముందు భాగం టైరు రోడ్డు మార్జిన్ దిగింది. కొంచెం ముందుకు వెళ్లడంతో వెనుక టైర్లు కూడా రోడ్డు మార్జన్ దిగాయి. దీంతో బస్సు ఒక వైపు ఒరిగింది. వెంటనే డ్రైవరు బస్సును ఆపేశారు. స్థానికులు స్పందించి.. డ్రైవర్ సహకారంతో ఎమర్జెన్సీ డోర్, డ్రైవర్ డోర్ నుంచి పిల్లలను కిందికి దించారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం క్రేన్ సహాయంతో బస్సును రోడ్డు మీదకి తీసుకొని వచ్చారు. ఎస్ఐ ప్రేమ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బిటిపి స్పిల్‌వేలో ఇరుక్కుని యువకుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మగట్ట



మహ్మద్ ఫయాజ్ (ఫైల్‌ఫొటో)

అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండల పరిధిలోని బైరవాని తిప్ప ప్రాజెక్టు స్పిల్‌వేలో నీటి ప్రవాహంలో చిక్కుకుని యువకుడు మృతిచెందాడు. మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు... బైరవాని తిప్ప ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి దాదాపు రెండు వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు శనివారం ఉదయం ఒక గేటును అడుగు మేర ఎత్తారు. ఆ నీటి ప్రవాహాన్ని చూడటానికి రాయదుర్గం నుంచి మహ్మద్‌ఫయాజ్, మహ్మద్, హమాన్ అనే యువకులు అక్కడికి వచ్చారు. దానిని తమ సెల్‌ఫోన్‌లో ఫొటో తీసేందుకు నీటి ప్రవాహంలోకి దిగగా, ఆ సమయంలో పట్టు తప్పి నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. అయితే మహ్మద్, హమాన్ నీటి ప్రవాహం నుంచి అతికష్టం మీద బయటకు వచ్చారు. మహ్మద్ ఫయాజ్ (20) నీటి ప్రవాహంలో స్పిల్‌వేలో ఇరుక్కుపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే గేటును మూసివేశారు. స్పిల్‌వేలో కంపచెట్లలో చిక్కుకుని ఉన్న మహ్మద్ ఫయాజ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు మేస్త్రీపని చేసేవాడని, ఆయన తండ్రి సనావుల్లా కట్టెల మిషన్ డిపోలో పనిచేస్తున్నాడని బంధువులు తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు ఇలా ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఈ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

తుపాను నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండాలి

- టిడిపి నాయకులు, కార్యకర్తలకు పల్లా పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను ప్రభావం ఈ నెల 26 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉండనున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డి.ముప్పవరం వద్ద ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసి చేయి విరగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాడికి నిరసనగా తాడేపల్లిగూడెం డిపో అద్దె బస్సుల డ్రైవర్లు ధర్నా చేయడం పట్ల అభినందనలు తెలిపారు.

రైతన్నల పరిస్థితి అగమ్యగోచరం

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి పాలనలో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు రాష్ట్రంలో 1.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆపన్న హస్తం అందించాల్సిన కూటమి ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఆరుగాలం పడ్డ శ్రమ కళ్లముందే నీళ్లపాలవుతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. సిఎం చంద్రబాబుకు ఐటి మీదున్న శ్రద్ధ రైతాంగంపై లేదన్నారు. అన్నదాతకు భరోసా అనేది అంతా బూటకమేనన్నారు. రైతన్నలకు జరిగిన అపార నష్టంపై ఉన్నత స్థాయి సమావేశాన్ని వెంటనే జరపాలని, తక్షణమే రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుప్పంలో గోడ కూలి పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కుప్పం (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్య పనులు చేస్తుండగా గోడకూలి ఒక కార్మికుడు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో 15 మంది మున్సిపల్ కార్మికులు కాలువను శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా గోడ కూలింది. దీంతో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆటోల్లో కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన శివయ్య మార్గమధ్యలో మృతిచెందారు. నెల్లూరు జిల్లాకు చెందిన పారిశుధ్య కార్మికులు సురేష్, హజరత్ అయ్యా, వెంకటేశుచికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుతుక్రమ సమయంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

- కెజిబివి సహా మాధ్యమిక పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం
- 'ప్యూర్' సంస్థతో ఎస్ఎస్ఎ ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుక్త వయస్సు బాలికలకు రుతుక్రమ సమయంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాక్రమానికి ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కెజిబివి) సహా 8 వేల మాధ్యమిక పాఠశాలల్లో 'ప్యూర్‌ఫెమ్' పేరిట ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందుకోసం 'పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థతో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో జరిగిన ఈ ఒప్పంద పత్రాలపై సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ప్యూర్ సంస్థ వ్యవస్థాపకులు శైల తల్లూరి శనివారం సంతకాలు చేశారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలకు రుతుస్రావ పరిశుభ్రత నిర్వహణ, ఆరోగ్యం, శ్రేయస్సు, వ్యక్తిగత భద్రతపై నిర్మాణాత్మక వర్కుషాప్‌లు, అవగాహన సదస్సులు అందించనున్నారని డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సమగ్రశిక్ష ఫ్రేమ్‌వర్క్ కింద సంపూర్ణ విద్య, లింగ సమానత్వం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. కౌమార దశ బాలికలకు ఆరోగ్య విద్య ద్వారా వారిని మరింత శక్తిమంతం చేయడానికి ప్యూర్ సంస్థ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఒక కీలకమైన అడుగు అని వెల్లడించారు.

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు (ఎస్‌డిజి), ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం విభాగం డైరెక్టర్ ఆర్ఎస్ గంగాభవానీ, ఒకేషనల్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ సి శ్రీలత, అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ పి వనజ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ

- రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - యంత్రాంగం



ఏలూరులో బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం నేపథ్యంలో ప్రయివేట్ వాహనాలను తనిఖీలు చేశారు. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. అత్యవసర తలుపులు సరిగ్గా పనిచేస్తున్నాయా? అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయా? లేదా? బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ లైసెన్సులు వంటివి పరిశీలించారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుండి శనివారం ఉదయం ఆరు గంటల వరకు వాహన తనిఖీలు చేపట్టి 55 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు బస్సులను సీజ్ చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ నిర్వహించారు. ఇందులో ఫైర్ ఎక్విప్‌మెంట్ లేని 23 బస్సులు, ప్యాసింజర్ల వివరాలు లేని నాలుగు బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్‌ను రవాణా చేస్తున్న ఏడు బస్సులు, ట్యాక్స్ పెండింగ్లో ఉన్న రెండు బస్సులు, ఎమర్జెన్సీ డోర్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా సీటు ఏర్పాటు చేసిన ఒక బస్సు, డార్జిలింగ్ లైట్లు ఏర్పాటు చేసిన 18 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో ట్యాక్స్ పెండింగ్లో ఉన్న రెండు బస్సులను, ఎమర్జెన్సీ డోర్ వద్ద సీటు ఏర్పాటు చేసిన ఒక బస్సును సీజ్ చేసినట్లు తెలిపారు. విశాఖలో మద్దిలపాలెం, మధురవాడ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఐదు బస్సులపై కేసులు నమోదు చేశారు. విజయనగరంలో నాలుగు బస్సులను సీజ్ చేశారు. ఒంగోలులోని ముంగమూరు రోడ్డు, అద్దంకి బస్టాండ్ మరియు టంగుటూరు టోల్ గేట్ వద్ద సుమారు 65 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు చేసి, నాలుగు బస్సులు సీజ్ చేశారు. కోనసీమ జిల్లాలో 27, చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12, నంద్యాలలో నాలుగు కేసులు నమోదు చేశారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేవని ఎనిమిది బస్సులు, అత్యవసర ద్వారం లేదని 13 బస్సులపై కేసులు నమోదు చేశారు. అగ్నిమాపక పరికరాలు లేవని 103 బస్సులపై, ప్యాసింజర్ లిస్టు లేని కారణంగా 34 బస్సులపై, ఇతర ఉల్లంఘనలపై 127 కేసులు నమోదు చేశారు.

రైళ్లలో మహిళల భద్రతకు చర్యలు

- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా ప్రయాణికుల భద్రత కోసం రైళ్లలో తగు చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె శ్రీదేవి, వి సావిత్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కదులుతున్న రైళ్లలో మహిళలపై అత్యాచార యత్నాలు పెరగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 8న ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు వెళ్తున్న 20 ఏళ్ల విద్యార్థినిపై రైల్వే టిటిఇ అభిజిత్ కుమార్ అత్యాచార యత్నం చేశారని తెలిపారు. ఈ అంశంపై విద్యార్థిని విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అభిజిత్‌పై శాఖాపరమైన విచారణను ప్రారంభించారని వివరించారు. ఈ విచారణ అత్యంత వేగంగా జరిపి అతనిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరిగిన వెంటనే గుంటూరు-పెదకూరపాడు మధ్య కదులుతున్న రైలులో ఓ ప్రయాణికురాలిపై అత్యాచార ఘటన జరిగిందన్నారు. ఈ మేరకు మహిళా ప్రయాణికుల భద్రత కోసం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రైలు బోగీల్లో గస్తీ పెంచాలని, ఊరికి దూరంగా, జనసంచారం అంతగా ఉండని రైల్వే స్టేషన్లలో రాత్రి సమయాల్లో తనిఖీలు నిర్వహించాలని, రైలు బోగీల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, రైళ్లలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి నెంబర్‌ను పబ్లిక్‌గా బోగీల్లో బోర్డులు రాయించాలని డిమాండ్ చేశారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన నలుగురులో ముగ్గురి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. వీరిలో తేజ (19), ప్రకాష్ (16), మునిచంద్ర (17) ఉన్నారు. శుక్రవారం సాయంత్రం ఒకరి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గల్లంతైన ముగ్గురి కోసం దాదాపు 24 గంటల పాటు పోలీసులు, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలించాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. యువకులను కడసారి చూసేందుకు తిరుపతి రూరల్ అవిలాల వేదాంతపురం అగ్రహారానికి చెందిన గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సాయంకాలం అంత్యక్రియలు నిర్వహించారు. బాలు, తేజ ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు.

అదుపు తప్పిన శాంతిభద్రతలు

- వైసిపి అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలు పక్కనబెట్టి జేబులు నింపుకోవడంలో బిజీ అయ్యారని వైసిపి అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. పొలిటికల్ గవర్నెన్స్ పేరుతో శాంతి భద్రతలను ధ్వంసం చేస్తున్నారని, కూటమి నేతలు అవినీతిలో పోటీపడుతున్నారని వివరించారు. ప్రజారోగ్యం పడకేసిందని, ప్రకృతి విపత్తులతో రైతులు కుదేలయ్యారని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని పేర్కొన్నారు. టిడిపి ఎమ్మెల్యే ఆ పార్టీ ఎంపి అక్రమాలపై విమర్శలు చేస్తున్నారని వివరించారు. డబ్బులు పంచి కౌన్సిలర్లను కొనుగోలు చేశారని ఎమ్మెల్యే చెప్పారని, దీనికి టిడిపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదానికి కారణమైన వ్యక్తి బెల్టుషాపులో మద్యం తాగి బండి నడిపారని, దీనివల్లే ప్రమాదం జరిగినట్లు వార్తలు వస్తున్నాయని అన్నారు.

అమరావతిలో ఒక్క కంపెనీ ముందుకు రాలేదు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రచారం చేస్తున్నారని, దానిలో ఏ మాత్రమూ నిజం లేదని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు.

ఇప్పటి వరకూ అమరావతిలో పెట్టుబడులకు ఒక్క కంపెనీ ముందుకు రాలేదని పేర్కొన్నారు. జగన్ తెచ్చిన పెట్టుబడులను తనవిగా చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. వైసిపి హయాంలోనే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని పేర్కొన్నారు. అకాల వర్షాలతో రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వివరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు : ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థల అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కర్నూలు సమీపంలో దగ్ధమైన కావేరి ట్రావెల్స్ బస్సుకు సంబంధించి రూ.23,120 పెండింగ్ చలానాలు ఉన్నట్లు అధికారులు చెప్పడం విచారకరమని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న బస్సు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌టిసిని బలోపేతం చేసి, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది.

పిహెచ్‌సి వైద్యుల ఆందోళన విరమణ

- సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆందోళన విరమించారు. పిజి మెడికల్ ఇన్ సర్వీస్ కోటా కొనసాగింపు, ఉద్యోగ సర్వీస్ వ్యవహారాలు వంటి అంశాలపై సెప్టెంబరు 28 నుంచి వైద్యులు ఆందోళన చేపట్టారు. పిహెచ్‌సి వైద్యుల సంఘం, ఎపివివిపి వైద్యుల సంఘం నేతలతో మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం చర్చలు జరిపారు. తమ సమస్యలు పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ నేపథ్యంలో ఆందోళనలు విరమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం (ఎపిపిహెచ్‌సిడిఎ) అధ్యక్షులు రవీంద్ర నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ చర్చల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో పిజి మెడికల్ ఇన్ సర్వీస్ కోటాను 20 శాతం, 2026-27లో 15 శాతం కోటాను సాగించేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారని వెల్లడించారు. డిఎన్‌బి కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే విషయం, ట్రైబల్ అలవెన్స్, టైమ్‌బౌండ్ ఉద్యోగోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, అర్బన్ సర్వీస్ ఐదేళ్లకు కుదింపు వంటి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ దీక్షలను విరమించి విధుల్లోకి హాజరుకావాలని నిర్ణయించామని వెల్లడించారు. నవంబరులో జరిగే చర్చలు ఆధారంగా తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

మోడీ పాలనలో దేశం తిరోగమనం

- కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
- 'మీట్‌ది ప్రెస్'లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



మోడీ పాలనలో దేశం తిరోగమనంలో ఉందని, ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదని సిపిఐ రాష్ట్ర నూతన కార్యదర్శి జి ఈశ్వరయ్య తెలిపారు. దేశ ఐక్యతకు భిన్నంగా పరిపాలన చేస్తున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయమని, ప్రజల గుండెల్లో ఎర్రజెండాకు చెరగని ఆదరణ ఉందని ఆయన తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎపియుడబ్ల్యుజె, ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన మీట్‌ది ప్రెస్ కార్యక్రమం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా మతపరమైన దాడులు జరుగుతున్నాయని, మణిపూర్‌లో జరిగిన దాడులు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని అన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాని స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఒకవైపు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తూ మరోవైపు కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులకు రూ.లక్షల కోట్ల రుణాలు రద్దు చేయడాన్ని ఈశ్వరయ్య తప్పుబట్టారు. దేశ వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఉందని, వాటిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రాకపోగా కార్పొరేట్లకు రాయితీలు, వడ్డీల మాఫీ, రుణాల రద్దు పేరుతో సంపదను దోచిపెడుతున్నాయన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ తీసుకొస్తామని చెప్పి నేడు ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదని ఆయన విమర్శించారు. మోడీ ప్రకటించిన జిఎస్‌టి సంస్కరణల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి పేదలకు చదువును దూరం చేస్తున్నారన్నారు. మరోపక్క 17 మెడికల్ కాలేజీల్లో 10 మెడికల్ కాలేజీలను పిపిపి మోడ్‌లో ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకునే పరిస్థితికి వచ్చారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేడు మౌనం దాల్చారని విమర్శించారు. సమావేశంలో ఐజెయు సభ్యులు షేక్ బాబు, ఎపియుడబ్ల్యుజె విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

'తుది' యాత్ర!

'నిర్లక్ష్యం ప్రాణాల కంటే చవకగా మారినప్పుడు, నాగరికత తన అర్థాన్ని కోల్పోతుంది' అంటారు గాంధీజీ. మన పాలకులు, అధికార యంత్రాంగం, సాంకేతికత ప్రజల మాన ప్రాణాలకు భరోసాగా నిలవలేనప్పుడు, ఒక నిర్లక్ష్యపు చర్య వలన నిరపరాధులు ప్రాణాలు కోల్పోతే, ఆ అభివృద్ధి తన విలువను కోల్పోతుంది. ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం, ఫిట్‌నెస్ లేని వాహనం, అధిక వేగం, డ్రైవర్ అలసట, భద్రతా లోపాలు- వీటి విలువ 19 నిండు ప్రాణాలు. ఇది గుండెల్ని పిండే విషాదం. గాల్లో తేలుతున్నట్లు రోడ్డుపై దూసుకుపోయే ప్రైవేటు బస్సు సృష్టించిన భయానక వీరంగం. ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ప్రయాణీకుల భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న కఠోర వాస్తవాన్ని మరోసారి కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెరపైకి తెచ్చింది.

ఒక కొడుకు ఫోన్ చేసి... 'నేను సూర్యాపేట జంక్షన్‌లో వెయిట్ చేస్తున్నా అంటే, ఆ..ఆ.. నేను కాసేపట్లో వచ్చేస్తాను' అంటాడో తండ్రి బస్సులో నుంచి. ఒక తండ్రి కుమార్తెతో 'ఉదయం నువ్వు నిద్ర లేచేసరికి నీ ముందుంటాను. హాయిగా నిద్రపో తల్లీ...' అంటాడు. ఇలాంటి సంభాషణలు 'జర్నీ' సినిమాలో చూశాం. కర్నూలు జిల్లాలో అగ్నికి ఆహుతైన బస్సులోనూ ఇలాంటి దృశ్యమే జరిగింది. కాకపోతే.. ఇక్కడ ఒక కూతురు తన తండ్రికి చెబుతుంది ఇలాంటి మాటలే. సెలవులు గడిపి వెళుతున్నవారు, ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం వెళుతున్నవారు- వీరందరి గమ్యస్థానం బెంగళూరు. రేపటి గురించి కలలు కంటూ స్లీపర్ బస్సులో ఆదమరిచి నిద్రిస్తున్నారంతా. వారికి తెలియదు అదే తమ చివరి ప్రయాణమని. నిబంధనలు, భద్రతా ప్రమాణాలు ఏమాత్రం పాటించని ప్రైవేటు నిర్వాకం.. ఆ ప్రయాణాన్ని 'డెత్ జర్నీ'గా మార్చేసింది. వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు క్షణాల్లో అగ్నిగుండంగా మారింది. గుర్తుపట్టలేని విధంగా బొగ్గుల్లా మారాయి ప్రయాణీకులు మృతదేహాలు. మొత్తం 44 మంది ప్రయాణీకుల్లో 19మంది సజీవ దహనమయ్యారు. బస్ లగేజీ క్యాబిన్‌లోని సుమారు 400 మొబైల్ ఫోన్లు పేలడం వల్ల కూడా ప్రమాద తీవ్రత పెరిగిందని ఫోరెన్సిక్ బృందాల ప్రాథమిక అంచనా. ఇటీవల రాజస్తాన్‌లో ఇలాంటి దుర్ఘటనే జరిగింది. 21మంది కాలి బూడిదయ్యారు.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రైవేట్ ఆపరేటర్లకు రాబడి యావ తప్ప ప్రయాణీకుల భద్రత పట్టదు. సరైన అనుమతుల్లేకుండా, పాత బస్సులకు మెరుగులు దిద్ది రోడ్డెక్కిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నేషనల్ పర్మిట్ తీసుకొని స్లీపర్లుగా మార్చుతున్నారు. ఈ బస్సుల డిజైన్లలోని లోపాలే మృతుల సంఖ్య పెరగడానికి కారణమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. స్లీపర్ బస్సుల్లో సీట్ల మధ్య గాని, నడవడానికి గాని ఖాళీయే వుండదు. చాలా వాటికి ఎమర్జెన్సీ డోర్స్ కూడా వుండవు. గంటకు 130-140 కి.మీ. వాయువేగంతో పరుగులెత్తే ట్రావెల్ బస్సులు...ప్రయాణీకుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. బెంగళూరు-హైదరాబాద్ మధ్యనున్న 575 కి.మీ. దూరాన్ని ఏడుగంటల్లో చేరుకోవాలి. అంటే, గంటకు కనీసం 120-140 కి.మీ. వేగంతో ప్రయాణం చేయాలి. వేగం తగ్గినా, గమ్యాన్ని చేరుకునే సమయం దాటినా ఆ డ్రైవర్ యజమానికి వివరణ ఇచ్చుకోవాలి. ఈ క్రమంలో ట్రావెల్ బస్సులకు స్పీడ్ లాకింగ్ వున్నా... వాటిని తొలగించేస్తున్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం.. వాణిజ్య వాహనాల క్యాటగిరీ కింద వచ్చే వాహనాల వేగం గరిష్టంగా గంటకు 90 కి.మీ. మించి వుండరాదు. ఈ మేరకు స్పీడ్ లాకింగ్ వుండాలి. ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సుల్లో అయితే, గరిష్టంగా 80 కి.మీ, ఏసీ బస్సుల్లో 90 కి.మీ. వేగం వరకు మాత్రమే ప్రయాణించేలా స్పీడ్ లాకింగ్ వుంటుంది. ఈ విధానాన్ని ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు అతిక్రమిస్తూ, ప్రయాణీకుల ప్రాణాలను గాల్లో కలిపేస్తుంటే... రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రతి ప్రమాదం ఒక పాఠం కావాలి. కానీ మనం పాఠం నేర్చుకోవడంలోనే విఫలమవుతున్నాం. కనుకనే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతున్నాయి. 'పబ్లిక్ సేఫ్టీ' ఒక నినాదం కాదు, అదొక బాధ్యత. ప్రభుత్వాలు ప్రమాదాల నివారణకు శాశ్వత మార్గాలను అన్వేషించాలి. కఠిన నిబంధనలను అమలుచేయాలి. అతిక్రమించినవారి పర్మిట్లను రద్దు చేయాలి. అన్నిటికంటే ముందు అతివేగాన్ని కట్టడి చేయాలి.

మహనీయుల మాట




చదువు మనిషిని పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది.
చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది.
రాత కచ్చితమైన మానవునిగా తీర్చిదిద్దుతుంది.

- ఫ్రాన్సిస్ బేకన్,
బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

ప్రస్తుతం

గూగుల్ సెంటర్ 'క్రెడిట్ వార్'





తెలకపల్లి రవి

పది రోజుల కిందట విశాఖపట్టణంలో గూగుల్ ఎ.ఐ డేటా సెంటర్ ప్రకటన, సంతకాలు జరిగినప్పటి నుంచి ఎ.పి లో అదో పెద్ద చర్చనీయాంశంగా మారింది. మరో విధంగా చూస్తే దేశంలో ప్రపంచంలో కూడా ఎ.ఐ డేటా సెంటర్ల గురించి, వాటి ప్రభావం గురించి విస్తారమైన చర్చ జరుగుతున్నది. ఇక ఎ.పి లో షరామామూలుగా టిడిపి, వైసిపి ల మధ్య డేటా సెంటర్ సాధన ఘనత ఎవరిదన్న రభస సాగుతున్నది. దీన్ని స్థాపించడం నిజంగా అసాధారణ స్థాయిలో చెప్పుకోదగిన విజయమా లేక రుద్దబడిందా అనేది మరో చర్చ. దీనివల్ల లాభం ఎంత? ముఖ్యంగా కొత్తగా వచ్చే ఉద్యోగాలెన్ని? అనేదానిపైనా రకరకాల వాదనలు. అసలు ఇది ఎవరిదన్న ప్రశ్న కూడా ముందుకొచ్చింది. వీటికి సమాధానాలు తెలుసుకోవడం అవసరమే గాక అనివార్యం కూడా అవుతున్నది. ఇందుకు సంబంధించి నేతల పోటాపోటీ ప్రకటనలు, ఆరోపణలు, ఆర్భాటాలు గాకుండా వాస్తవంగా గత ఆరేడేళ్లలో వాస్తవంగా జరిగిందేమిటో, ఇప్పుడు జరుగుతున్నదేమిటో చూద్దాం.

క్రెడిట్ వార్

గూగుల్ ఎ.ఐ డేటా సెంటర్ ఘనమైందా కాదా అనేది తర్వాత. అసలు ఎవరు తెచ్చారు? చంద్రబాబు నాయుడు హయాంలో 2019 జనవరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకూ మధ్య అవగాహన కుదిరింది. 70 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ రాబోతున్నట్టు జనవరి 9న దీనిపై చంద్రబాబు ట్వీట్ చేశారు. తదుపరి ఎన్నికల్లో ఓడిపోయారు. జగన్ ప్రభుత్వ హయాంలో కరోనా ముగింపు దశలో అదానీ గ్రూపు మళ్లీ చర్చలు మొదలుపెట్టింది. అదానీ తాడేపల్లిలో జగన్ అధికార నివాసంలో చర్చలు జరిపి వెళ్లారు. 2023 మే 23న అదానీ డేటా సెంటర్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. 'అదానీ బిగిన్స్ వర్క్' అని ఇంగ్లీషు వాణిజ్య పత్రికలు కూడా వార్తలు ప్రచురించాయి. ఆ రోజున శంకుస్థాపనకు అదానీ రాలేదు. ఆయన కుమారులైన జీతూ, గౌతం అదానీలు హాజరైనారు. రూ.21,844 కోట్ల పెట్టుబడితో సెంటర్ వస్తుందని 1800 మందికి ప్రత్యక్షంగా 32,000 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించి ఇందుకోసం 60.29 ఎకరాలు కేటాయించారు. చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందంలో కొన్ని అంశాలను తాము మార్పు చేయించామన్నారు. జగన్ 2024లో ఓడిపోయారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2024 డిసెంబర్ 5న గూగుల్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి నుంచి దానిపై ఐ.టి మంత్రి లోకేశ్ తరచూ చెబుతూ వచ్చారు. హైదరాబాద్‌కు గూగుల్ రావడానికి ఇంతకాలం పడితే ఎ.పి కి ఏడాదిలోనే వచ్చేసిందన్నారు. చంద్రబాబు మైక్రోసాఫ్ట్ తెస్తే, లోకేశ్ బాబు గూగుల్ తెచ్చాడన్నారు. అక్టోబర్ 15న ఢిల్లీలో 'భారత ఎ.ఐ శక్తి సమిట్' పేరిట జరిగిన ఈవెంట్‌లో సంతకాలు ప్రకటించారు. ఈ మొత్తం సందడిలో ఎక్కడా అదానీ పేరు వినిపించలేదు. కేంద్ర రాష్ట్ర నేతల సమక్షంలో జరిగిన ఒప్పందంలోనూ అదానీ కనిపించలేదు. కానీ గూగుల్ క్లౌడ్ సిఇవో గా వున్న థామస్ కురియన్ అదానీని ముందు కలిశారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో భాగస్వామి అవుతున్నందుకు గర్వంగా వుందని అదానీ ట్వీట్ చేశారు. ప్రపంచ కుబేరుల జాబితాలు ప్రకటించే 'ఫోర్బ్స్' పత్రిక అదానీ గూగుల్‌తో కలసి దీన్ని స్థాపిస్తున్నట్టు వార్త ఇచ్చింది. 'రాయిటర్స్' కూడా అదే పేర్కొంది. మరి ప్రధాని మోడీగానీ చంద్రబాబు, లోకేశ్‌లు గానీ ఈ హడావుడిలో అదానీ పేరు ఎందుకు పక్కన పెట్టినట్టు? ఆఖరుకు సర్కారును బలపర్చే మీడియా కథనాల్లోనూ ఎక్కడా ఆ పేరే రాలేదే? ఇక్కడ తామే తెచ్చామని వాదించిన వైసిపి వారు కూడా అదానీ పేరు తీసుకురాలేదు. ఈ చర్చ వచ్చాకనే చిన్న వివరణతో సరిపెట్టడానికి ప్రయత్నించారు. అప్పటికీ అదానీ కేవలం కాంట్రాక్టరు మాత్రమేనన్నట్టు కొందరు అధికార ప్రతినిధులు చెప్పుకొచ్చారు. వైసిపి విషయానికి వస్తే ఏకంగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కేవలం అదానీ వల్లనే, ఆయన సింగపూర్ వెళ్లి సముద్ర గర్భంలో కేబుళ్లు వేసేందుకు ఏర్పాటు చేసినందువల్లనే ఈ డేటా సెంటర్ సాధ్యమైందని ప్రకటించారు. అదానీకి క్రెడిట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నలు గుప్పించారు. విషయం ఏమంటే గూగుల్ అదానీ ఒప్పందం మోడీ చలవతో కుదిరితే రెండు ప్రాంతీయ పాలక పార్టీలు తలవంచాయన్నమాట. ఇందువల్ల ఆర్థిక క్రెడిట్ మొత్తం అదానీ ఖాతాకే జమ అవడం తథ్యం. గంగవరం, కృష్ణపట్టణంతో సహా ప్రతి చోటా అదానీ చొరబాటు చూస్తున్న ప్రజల స్పందనను తగ్గించేందుకే ఏలినవారు గూగుల్ ప్రచారానికే పరిమితమయ్యారన్నమాట.

గూగుల్ అదానీ ఒప్పందం మోడీ చలవతో కుదిరితే రెండు ప్రాంతీయ పాలక పార్టీలు తల వంచాయన్నమాట. ఇందువల్ల ఆర్థిక క్రెడిట్ మొత్తం అదానీ ఖాతాకే జమ అవడం తథ్యం. గంగవరం, కృష్ణపట్టణంతో సహా ప్రతి చోటా అదానీ చొరబాటు చూస్తున్న ప్రజల స్పందనను తగ్గించేందుకే ఏలినవారు గూగుల్ ప్రచారానికే పరిమితమయ్యారన్నమాట.

సాంకేతిక విజయమేనా?

ఇక అశ్వమేధ యాగంలో రాజ్యాలు జయించినట్టు అందరితో పోటీ పడి మరీ గొప్ప శక్తియుక్తులతో దీన్ని తీసుకొచ్చామనేది టిడిపి నేతల హంగామా. తాము దీనికోసం ఎగబడలేదనీ, 22 వేల కోట్ల రాయితీలు ఇవ్వడానికి సిద్ధపడలేదని కర్ణాటక మంత్రి ప్రియాంక ఖర్గే అంటున్నారు. తమిళుడైన గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్ భారత దేశాన్ని ఎంచుకున్నారని లోకేశ్ ముక్తాయించారు. ఎ.పి తో అదానీ అనుబంధం ఇందుకు కీలకమైందని స్పష్టంగా కనిపిస్తూనే వుంది. అదలా వుంచితే ఎ.ఐ డేటా సెంటర్ కేవలం వరమేనా? శాపం లక్షణాలు కూడా వున్నాయా? ఎన్‌డిటివి అదానీ గ్రూపు యాజమాన్యం (లోకి) తెచ్చుకున్న సంస్థ. ఈ విషయమై అక్టోబరు 16న ఎస్‌విబి భట్టాచార్య అనే నిపుణుడి వ్యాసం ప్రచురించింది. దాని శీర్షికలోనే దీంతో ముడిపడిన సమస్యలను సూచించింది, సాంకేతికంగా కలిగే లాభాలను చెబుతూనే పర్యావరణ పరంగా తలెత్తే సవాళ్లనూ చెప్పింది. అంతకు మించి సాంకేతిక రంగంలోనూ భారతదేశం స్వంతంగా ఎదగడానికి ఇది ఎలా ప్రతిబంధకాలు సృష్టించగలదో చెప్పింది. డేటా సేకరణ వల్ల దేశానికి రాజకీయ వాణిజ్య రంగాల్లో దేశ సార్వభౌమత్వానికి ఆటంకాలు ఏర్పడతాయని స్పష్టం చేసింది (ఈ రచన వ్యక్తిగతమైనా నేటి మీడియా పరిస్థితుల దృష్ట్యా అదానీ గ్రూపు సంస్థలో ప్రచురించడమే ఒక సంకేతం.). సాంకేతికంగా దీనివల్ల భారత దేశానికి ఒరిగేదేమీ వుండదు. ఎందుకంటే ఇందులో సాంకేతిక పరిజ్ఞానం పంచుకోవడం, బదలాయింపు వంటి షరతులేమీ లేవు. పైగా మన వాణిజ్య డేటా మొత్తం వారి చేతుల్లోకి పోవడం వల్ల ఇక్కడ వ్యాపారాలకు నష్టం. గూగుల్‌పై భారత ప్రభుత్వ అదుపు ఏమీ వుండదు. కంప్యూటర్ విజ్ఞానంలో కీలకమైన అల్గోరిథమ్ వ్యవస్థను మనకు పరిచయమే చెయ్యరు. కాకపోతే గూగుల్ వచ్చింది గనక మిగతావారూ వస్తారనేది ఆశ. అది వారి సంబంధాలను బట్టి వుంటుంది.

ఇక ఎ.ఐ డేటా సెంటర్ వల్ల లక్ష 80 వేల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొట్టడం గురించి. జగన్ హయాంలో 1800 మందికి ప్రత్యక్షంగా, 32,000 మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఇక మొన్న గూగుల్ ఒప్పందం తర్వాత టిడిపి కే చెందిన కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కేంద్రం వల్ల 5 నుంచి 6 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పినట్టు పిఐబి వార్త ఇచ్చింది. పరోక్షంగా మొత్తం (టోటల్ అనే మాట వాడారు) 20 నుంచి 30 వేల ఉద్యోగాలు రావచ్చన్నారు. దీనివల్ల ఎ.పి కి మొత్తం 10 వేల కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేశారు. మరి రెండు లక్షల ఉద్యోగాల కబుర్లు ఎలా వచ్చాయి? ఇప్పుడు గూగుల్ ఉద్యోగులందరి సంఖ్య కూడా అంత వుండదేమో.

ఉద్యోగాల ఊదర

ఇక ఎ.ఐ డేటా సెంటర్ వల్ల లక్ష 80 వేల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొట్టడం గురించి. జగన్ హయాంలో 1800 మందికి ప్రత్యక్షంగా, 32,000 మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఇక మొన్న గూగుల్ ఒప్పందం తర్వాత టిడిపి కే చెందిన కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కేంద్రం వల్ల 5 నుంచి 6 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పినట్టు పిఐబి వార్త ఇచ్చింది. పరోక్షంగా మొత్తం (టోటల్ అనే మాట వాడారు) 20 నుంచి 30 వేల ఉద్యోగాలు రావచ్చన్నారు. దీనివల్ల ఎ.పి కి మొత్తం 10 వేల కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేశారు. మరి రెండు లక్షల ఉద్యోగాల కబుర్లు ఎలా వచ్చాయి? ఇప్పుడు గూగుల్ ఉద్యోగులందరి సంఖ్య కూడా అంత వుండదేమో. విశాఖలో ఏర్పాటు చేసే కేంద్రానికి సంబంధించి గూగుల్ అధికారిక సైట్‌లోనైతే అసలు ఉద్యోగాల సంఖ్యనే ఇవ్వలేదు. సాంకేతికంగా వ్యాపారాలకు కలిగే ప్రయోజనం గురించి ప్రధానంగా చెప్పారు. అంతేగాక హైదరాబాద్, బెంగళూరు, పూనే, చెన్నై వంటి చోట్ల గల గూగుల్ కేంద్రాలతో సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా తదితర అంతర్జాతీయ కేంద్రాలతో అనుసంధానం చేసుకుంటామన్నారు. కనుక ఇక్కడ ఎ.పి కి ప్రత్యేకంగా ఏదో చెప్పిందిగానీ, లేక హామీ ఇచ్చిందిగానీ లేదు. పైగా డేటా సార్వభౌమత్వం తమ చేతుల్లో వుంచుకుని రేవులను సంధానం చేసుకోవడం భద్రతా పరంగానూ సున్నితమైన సమస్యే. అసలు మౌలికంగా ఎ.ఐ అనేది మనుషులను తగ్గించి కృత్రిమ మేధను ఉపయోగిస్తుంది. డేటా ఆపరేషన్లు తేలిగ్గా చేస్తుంది. ఉదాహరణకు సందర్భం వేరైనా 'టైమ్స్ ఆఫ్ ఇండియా' శుక్రవారం (24వ తేదీ) ఒక వార్త ఇచ్చింది. సూపర్ కంప్యూటర్స్ మూడున్నర ఏళ్లలో చేసే పని రెండు గంటల్లో చేసే 'విల్లో చిప్' జయప్రదమైందని సుందర్ పిచాయ్ ప్రకటించారు. ఎ.ఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ అన్నీ అందుకే ఉద్దేశించబడ్డాయి. కనుక ఈ సెంటర్ ఉద్యోగ కల్పన ప్రధానమైంది కాదు. వారెవరూ అలా చెప్పలేదు కూడా.

అదానీ - అమెరికా బంధమేంటి?

గూగుల్ ఎ.ఐ గురించి ఇంతగా మాట్లాడుతున్న సమయంలో అమెరికా పరిస్థితి ఏంటో కూడా చూడాలి. ఆర్థికంగా తీవ్ర సవాళ్లలో కూరుకుపోయిన అమెరికా ఇప్పుడు ఎ.ఐ గాలిబుడగపై కేంద్రీకరించాలని నిర్ణయించింది. డోనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో భారీ ఎత్తున ఈ కంపెనీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రపంచమంతటా ఎ.ఐ కేంద్రాలపై భారీగా పెట్టుబడి పెట్టాలనీ, ప్రోత్సహించాలనీ నిర్ణయానికొచ్చారు. ఇందులో భాగంగా గూగుల్ 25 బిలియన్లు, బ్లాక్‌స్టోన్ 25 బిలియన్లు, కోర్‌వీవ్ 6 బిలియన్లు పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించాయి. ఈ ఊపులో ట్రంప్ వైట్‌హౌస్‌లో తలపెట్టిన బాల్‌రూం నిర్మాణానికి గూగుల్ 20 మిలియన్లు కేటాయించింది. ఆపిల్, మెటా, మైక్రోసాఫ్ట్‌లు, లాక్‌హీడ్ వంటివి కూడా పాలుపంచుకుంటున్నాయి. ఎ.ఐ గురించి ఇంతగా చెబుతున్నా ఇప్పటికీ కంపెనీల కార్యకలాపాలలో దాని వినియోగం 9.2 శాతం మాత్రమే వుందని, దాన్ని బాగా పెంచాలని నిర్ణయానికొచ్చాయి. ఇంకా చెప్పాలంటే రీగన్ కాలంలో సైనిక పారిశ్రామిక వ్యవస్థ తరహాలో ఎ.ఐ వ్యవస్థను పెంపొందించాలనేది వ్యూహం. అదానీ, అంబానీల వంటి వారు ఈ గొలుసు కట్టులో భాగంగా వుంటారు. ఆయుధాలతో దీన్ని పోల్చడానికి లేదు గానీ ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాల విషయంలో అదే ఆధిపత్యం కొనసాగుతుంది. కంప్యూటర్ డేటా కేంద్రాలను స్థాపించినంత మాత్రాన కంప్యూటర్ పరిజ్ఞానం వచ్చినట్టు కాదు. ఖచ్చితంగా చెప్పాలంటే అమెరికా ఎ.ఐ విషయంలో చైనాతో యుద్ధం చేస్తున్నది. ఇందులో తన విస్తరణ కోసం ఇండియా వంటి దేశాలను ఉపయోగించుకుంటుంది. ఈ క్రమంలో ఆ రెండు దేశాల తర్వాత స్థానంలో వున్న ఇండియా స్వతంత్ర సాంకేతిక శక్తిని పెంచకుండా ఆపడమూ జరుగుతుంది. ఎందుకంటే మన కార్పొరేట్లు తమ లాభం చూసుకుంటారే గాని దేశ సాంకేతిక సార్వభౌమత్వం గురించి ఆలోచించరు కదా.

పర్యావరణ వేటు

ఇక పర్యావరణ పరంగా విపరీతమైన నీటి వినియోగం, విద్యుత్ వినియోగం వంటి వాటిపై చాలా చర్చ జరిగింది. ఇక్కడ ఆ సమస్య తలెత్తబోదని మంత్రులు చెబుతున్నారుగానీ విపరీతంగా డేటా వాడే కేంద్రాలలో అది కుదిరేది కాదు. అమెరికాలోని ఇండియానాపోలిస్ లో స్థానిక ఒత్తిడి వల్ల గూగుల్ తనే ఎ.ఐ డేటా సెంటర్ స్థాపన ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. చిలీ వంటి చిన్నదేశంలోనూ ఇదే జరిగింది. మెక్సికో, సౌదీ అరేబియా, ఇంకా కొన్ని యూరోపియన్ దేశాలలోనూ ఇదే జరిగింది. తూర్పు ఇంగ్లాండ్‌లో హెర్డ్‌ఫోర్డ్‌షైర్‌లో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం వల్ల ఉద్యోగాలు చాలా వస్తాయని ప్రచారం జరిగి అనుమతిస్తే నిర్మాణ దశలోనే భరించలేని కాలుష్యమంటూ నిరసనలు సాగుతున్నాయి. 'టైమ్' మేగజైన్ 2020 ఏప్రిల్ లోనే ఈ సమస్యలు లేవనెత్తింది. గూగుల్ ఎ.ఐ డేటా సెంటర్ వినియోగించే విద్యుత్ భారం గురించి అమెరికాలోనే ఒప్పందాల కోసం ఆపసోపాలు పడుతున్నది. ఈ మధ్యనే 100 మెగావాట్ల విద్యుత్ కోసం ఒప్పందం కూడా చేసుకుంటున్నది. ఒకప్పటి అణు విద్యుత్ చర్చలు కూడా మళ్లీ వస్తున్నాయి. భయంకరంగా వేడెక్కిపోయే ఈ సెంటర్లను చల్లార్చడానికి అపారమైన నీటి వనరులు అవసరమవుతాయి. దానిపైన వ్యతిరేకతకు మరో ప్రధాన కారణమిది. ఏమైనా డేటా సెంటర్లు వినియోగించే నీటి పరిమాణం ఎంత అనేది వ్యాపార రహస్యం (ప్రొప్రటేరియల్ సీక్రెట్)గా వుంటుంది. ఈ విషయం ఎప్పటికీ బయటకు రాదు. విశాఖ పరిసరాల్లో రకరకాల కాలుష్య పరిశ్రమలు, అడవుల కబళింపు జరుగుతున్న నేపథ్యంలో చూడాల్సిన విషయమిది.

★

అభిప్రాయం

అస్తిత్వం కోల్పోయిన పరాయీకరణ 'రీయూనియన్'



ముకుంద రామారావు

యాభై లక్షల సంవత్సరాల క్రితం అగ్నిపర్వతం నుంచి ఏర్పడిన ఈ ('రీయూనియన్') ద్వీపాన్ని మొదట అరబ్ వ్యాపారులు కనుగొన్నారు. త్వరలోనే ఆక్రమణదారులుగా పోర్చుగీస్, బ్రిటిష్, ఫ్రెంచ్ వారు చేరారు. చివరకు, ఫ్రెంచ్ వారు దీనిని వలసరాజ్యం చేసుకొని, 1793లో 'రీయూనియన్ ద్వీపం' అని నామకరణం చేశారు. మారిషస్-ఆఫ్రికాకు మధ్య ఉన్న ఈ ద్వీపం చావడానికి ఖైదీలను వదిలేసే (ద్వీపాంతర శిక్ష) ప్రదేశంగా ప్రారంభమైంది. కానీ ఖైదీలు సముద్రంలో ఈత కొట్టడం, పర్వతాలు ఎక్కడం, సారవంతమైన అగ్నిపర్వత నేలలో బియ్యం, కూరగాయలు, పండ్లు పండించడం లాంటి అందమైన జీవితాలను గడపడం ప్రారంభించారు. ఫ్రెంచ్ వారు ఆ స్వర్గాన్ని తాము స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. మొదట వారు చెరకు తోటల కోసం ఆఫ్రికన్లను బానిసలుగా ఇక్కడికి తీసుకువచ్చారు. బానిసత్వం రద్దు చేయబడిన తర్వాత, భారతదేశం నుంచి ఒప్పంద కార్మికులను తీసుకొచ్చారు. భారతీయ ఒప్పంద పత్రాలకు సంబంధించిన ఏ వివరాలూ, అధికారిక రికార్డుల్లో లేకుండా చేశారు.

1828 మార్చి 16న, 15 మంది తెలుగు ఒప్పంద కార్మికుల్ని దక్షిణ భారతదేశంలోని చిన్న ఓడరేవు యానాం నుంచి లా టర్క్వోయిస్ మీద తీసుకెళ్లారు. అందులో ఎక్కువగా అట్టడుగు కులాల నుంచి వచ్చిన నైపుణ్యం లేని కార్మికులే. వారి పేర్లు రాసుకుంటున్నప్పుడే మారిపోయాయి, అక్కడికి చేరాక వాళ్ల పేర్లు ఇంకెంతగా మారిపోయుంటాయో! పాండిచ్చేరిలో చాలా రోజులు ఆగి, రెండున్నర నెలలకు పైగా ప్రయాణం చేసిన తరువాత, జూన్ 3, 1828న, ఈ మొదటి 15 మంది కార్మికులు, లా రీయూనియన్‌కు చేరుకున్నారు. డిసెంబర్ 1828 నాటికి, ఆ చిన్న ఫ్రెంచ్ కాలనీలో దాదాపు 1100 మంది భారతీయ కార్మికులు చేరారు. ఆ తర్వాత విడతల వారీగా వేలాదిమందిని తరలించారు. వారితో వేతనాల ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అమలు కాలేదు. అయితే భారతీయ కార్మికుల నియామకాలు అధికారికంగా 1839-48ల మధ్య నిలిపేసి, 1848లో బానిసత్వాన్ని రద్దు చేసిన తర్వాత పున:ప్రారంభించారు. పిల్లల్ని వారి తల్లిదండ్రుల నుంచి వేరుచేయడానికి కూడా వారు వెనకాడలేదు.

ద్వీపానికి భారతీయ వలసదారుల సంఖ్య పెరగడంతో చెరకు పంట బాగా పెరిగింది. 1858 నాటికి, దాదాపు 64,400 మంది భారతీయ కార్మికులు ద్వీపంలోని పట్టణాల్లో, గ్రామాల్లో కూడా చక్కెర ఎస్టేట్ల పనుల్లో చేరి నివాసం ఏర్పర్చుకున్నారు.

1862లో, ఫ్రాన్స్-గ్రేట్ బ్రిటన్ మధ్య జరిగిన కొత్త సమావేశం ద్వారా భారతీయుల నియామకం నియంత్రించబడింది. బ్రిటన్‌తో కుదుర్చుకున్న ఒక ఒప్పందం ప్రకారం, ఏటా 6 వేల మంది భారతీయ ఒప్పంద కార్మికులను నియమించుకోవడానికి అనుమతి లభించింది. ఉద్యోగులు ఐదు నుంచి ఆరు సంవత్సరాల ఒప్పందం మీద సంతకం చేయాల్సి వచ్చింది. భార్యా పిల్లలు, తల్లిదండ్రులతో సహా కొందరు కుటుంబాలతో వెళ్లారు. వెళ్లిన తర్వాత, వారినందరినీ ద్వీపంలోని చక్కెర ఎస్టేట్లకు పంపారు. స్త్రీ పురుష కార్మికుల సంఖ్యలో అసమతుల్యత కారణంగా 1840ల చివరి, 1860ల మధ్య, భారతీయ పురుషులు, మహిళలు, పిల్లలు కష్టతరమైన జీవనాన్ని, పని పరిస్థితులను భరించారు. ఆ కాలంలో, షుగర్ ఎస్టేట్లలో, భయంకర పరిస్థితిని కొందరు తిరస్కరించారు. అక్రమార్జన, పనుల్ని విడిచిపెట్టడం, వ్యక్తిగత నిరసనలు, ఫిర్యాదులు చేయక తప్పలేదు. అప్పటికి 43,631 మంది విదేశీ కార్మికుల్లో 18,520 మంది భారతీయ కార్మికులు మాత్రమే మిగిలారు.

1880-1940ల మధ్య, వేలాది మంది మాజీ వలస కార్మికులు, వారి పిల్లలు పెద్ద షుగర్ ఎస్టేట్లను, ఖాళీ భూములను స్వాధీనం చేసుకొని, వారే భూస్వాములుగా, చిన్న చెరకు, కాఫీ సాగుదారులుగా, రైతులుగా, ఆక్రమణదారులుగా మారారు. ఆరు దశాబ్దాలకు పైగా, 5,000 నుంచి 6,000 మంది వరకు మాజీ భారతీయ ఒప్పంద కార్మికులు, వారి పిల్లలు భూమిని కొనుగోలు చేసి చిన్నపాటి ఆస్తి-యజమానులుగా రైతులుగా మారారని ఒక అంచనా.

1828-1936ల మధ్య, ఈ చిన్న హిందూ మహాసముద్ర ద్వీపంలో 1,47,000- 1,65,000 మంది భారతీయ, భారతీయేతర ఒప్పంద కార్మికుల్ని చేర్చారని అంచనా. 1900ల ప్రారంభం, 1930ల మధ్య కూడా, ఒప్పంద కార్మికులు, కుటుంబాలను స్థాపించి, ద్వీపంలో కొంత మేర సామాజిక, ఆర్థిక చలనశీలతను సాధించారు. క్రమంగా, వారు రీయూనియనీస్ సమాజంలో కలిసిపోగలిగారు. 1828-1936ల మధ్య, ఈ మహాసముద్ర ద్వీపంలో 1,20,000 మంది భారతీయ ఒప్పంద కార్మికులు చేరారని మరో అంచనా.



భారతీయ కార్మికులు దక్షిణ భారతదేశం నుంచి రీయూనియన్‌కు, ప్రస్తుత తమిళనాడు నుంచే ఎక్కువగా వెళ్లినా, మొదటి ఒప్పంద కార్మికులు మాత్రం తెలుగువారే. కొంతవరకు ఉత్తర భారతదేశంలోని ప్రస్తుత ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వారున్నప్పటికీ వారిని 'కలకత్తా' అని పిలుచుకుంటారు. అలాగే దక్షిణ భారతీయులందరినీ మలబారులు అని పిలుస్తారు. ఈ వలసదారులు పాండిచ్చేరి (పాండిచ్చేరి), కారైకల్ (కారికల్) ఫ్రెంచ్ స్థావరాల ద్వారా నియమించబడ్డారు. మద్రాస్, యానాం, కలకత్తా ఓడరేవుల నుంచి కూడా వచ్చారు. కఠినమైన జీవన పరిస్థితులు వారు లా రీయూనియన్‌కు వెళ్లడానికి ప్రధాన కారణం. దక్షిణ భారతదేశం నుంచి ఒప్పంద కార్మికుల వలస 1827లో ప్రారంభమైనా, 1848 తర్వాత మాత్రమే వలసలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. నిజానికి 17వ శతాబ్దం నుండే ఆ ద్వీపంలో దక్షిణ భారత సంతతికి చెందిన ప్రజలు ఉన్నారు. వారు ఎక్కువగా పాండిచ్చేరి నుంచి వెళ్లారు. కానీ ఎక్కువ మంది మొదట 19వ శతాబ్దం రెండవ భాగంలో మాత్రమే ఒప్పంద కార్మికులుగా వెళ్లారు.

పొరుగు దేశమైన మారిషస్ మాదిరిగా కాకుండా, రీయూనియన్ ద్వీపం పర్యాటక గమ్యస్థానంగా ముద్ర పడలేదు, అద్భుతమైన పర్వతాలు, అగ్నిపర్వతాలు, బీచ్‌లతో నిండి ఉన్నప్పటికీ ఈ చిన్న ఫ్రెంచ్ ద్వీపంలో దాదాపు 2,50,000 మంది భారతీయ సంతతికి చెందినవారు నివసిస్తున్నారు, మొత్తం జనాభాలో దాదాపు పావు వంతు నుంచి మూడింట ఒక వంతు మంది ఉన్నారు. రీయూనియన్ ద్వీపం ఫ్రాన్స్‌లో భాగమైనప్పటికీ, ఫ్రెంచ్ పాస్‌పోర్ట్‌లను కలిగి ఉన్నప్పటికీ, ఇక్కడి భారతీయులు స్వదేశంతో బలమైన బంధంతోనే ఉన్నారు.

ద్వీపంలోని చాలా మంది భారతీయులు శతాబ్దాల క్రితం తమ భారతీయ మూలాలు పూర్వీకుల స్పష్టమైన ఆధారాలు కోల్పోయారు. 1848 నుంచి 1860 మధ్య, ఒప్పంద కార్మికులుగా వచ్చిన దాదాపు 38,000 మంది భారతీయుల్ని స్వదేశానికి తిరిగి వెళ్ళకుండా చేయాలని వలస పాలకులు ప్రయత్నించారు. వారి పత్రాలను నాశనం చేయడమే కాకుండా, వారి మాతృభూమితో ఉన్న అన్ని సంబంధాలను తెంపే ప్రయత్నాలన్నీ చేశారు.

ద్వీపంలో మార్పుల గాలులు భారతీయ సమాజాన్ని మార్చాయి. దక్షిణ భారత ఒప్పంద కార్మికుల వారసుడైన గిల్బర్ట్ కెనబాడీ మౌటియన్, ద్వీపంలోని అత్యంత ధనవంతులలో ఒకడు, రీయూనియన్ ద్వీపానికి దక్షిణాన డొమైన్ మోన్ కాప్రిస్ అని పిలువబడే మొత్తం టౌన్‌షిప్ కు అధిపతి కాగలిగాడు.

'ఒప్పంద కార్మికుడు' అనే 'తక్కువ-చెడు' నామకరణం కింద, భారతీయులు బానిసత్వపు దుర్భర పరిస్థితులకు గురయ్యారని కెనబాడీ చెప్పారు. అతను ఇటీవల ది ఇండియన్ ఫ్రమ్ మోన్ కాప్రిస్ ఎస్టేట్ అనే చిత్రాన్ని నిర్మించాడు, ఇది అతని పూర్వీకుల చరిత్ర. అతను ప్రతి సంవత్సరం దక్షిణ భారతదేశానికి తీర్థయాత్రకు వస్తాడు, దేవాలయాలను సందర్శిస్తాడు, భారతీయ సంస్కృతి మీద అతని విశ్వాసాన్ని బలపర్చుకుంటాడు. కెనబాడీ అనేది గణపతి శబ్ద రూపాంతరం. ఇది అతని అసలు కుటుంబ పేరు కావచ్చు, ఇది తరం నుండి తరానికి మౌఖికంగా బదిలీ కావడంతో వక్రీకరించబడింది. అక్కడి సమాజంలో వచ్చిన చాలా ఆచారాలు, సంప్రదాయాలు నోటి మాట ద్వారానే వచ్చాయి.

జైపూర్‌లో జరిగిన ప్రవాసీ భారతీయ దివస్‌లో పి.ఐ.ఒ (పీపుల్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) హోదా కోసం లాబీయింగ్ చేస్తున్న 33 మందితో కూడిన ప్రతినిధి బృందంలో లొకేట్, వలేమా, కెనాబాడీ, కెనాగుయ్ ఉన్నారు. "వారు మమ్మల్ని భారతీయ ఆధారాలు అడుగుతారు. మేము నిజంగా భారతీయులమని నిరూపించుకోవాల్సిన అవసరం మాకు ఉందా? మా జాతీయత ఫ్రెంచ్ కావచ్చు, కానీ మా ఆత్మలు భారతీయులవే" అని కెనాగుయ్ నొక్కి చెప్పాడు.

/ వ్యాసకర్త సెల్:990 834 7273 /

కవిత్వం

చరమగీతి

పల్లవి: స్పందించే మనసుకు లోకమంత తనదే
అసమానత సమాజం నిదుర పట్టనీయదే
సహజీవన సమభావన పరిమళించే నా దేశం
మతోన్మాద జ్వాలల్లో ఆహుతవుతున్నదే
చరణం:
భిన్నత్వంలో ఏకత్వం ప్రేమను నింపింది
భారతావని విశ్వమంతా ఆదర్శం చాటింది
వందేమాతరమంటు నాడు యావత్ ప్రజ
కదిలింది
విభజించి పాలించిన తెల్లవాణ్ణి తరిమింది
నాటి ఆంగ్లేయుల తొత్తు సావర్కర్ వారసులు
నేడు నిండు పాలకుండలో విషం బొట్టు వేశారు
చరణం 2
రాజ్యాంగ వ్యతిరేకులు రాజ్యమేలుతున్నారు
మనుస్మృతిని అమలుచేయ కుట్ర పన్నుతున్నారు
రంగురంగుల పూలవనం అందమైన భారతం
మనువాదుల చేతిలో అవుతున్నది ధ్వంసం
ప్రశ్నిస్తే దేశద్రోహి ముద్ర వేసి దాడులు
లొంగకుంటే ఐ.టి, ఈడి చట్టాలతో అరెస్టులు
చరణం 3

మనోభావ ఆయుధాన్ని చేపట్టిన సనాతులు
మన రాజ్యాంగం పైనే నూరుచుండె కత్తులు
సాహిత్యం, సినిమాలు, పత్రికలు, కోర్టులు
వ్యక్తపరిచే భావాలపై పైశాచిక దాడులు
సనాతనం పేరుతో మనువాదుల వీరంగం
స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు కలిగించే విఘాతం
చరణం 4

స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన వీరులను
నాటి బ్రిటిషోడి పాలనలో దేశద్రోహులన్నారు
నేడు ప్రజల పక్షం నిలిచి పోరాడే యోధులను
ఈ కాషాయి పాలనలో దేశద్రోహులంటున్నారు
ఆ త్యాగధనుల జీవితాలు ఆదర్శం కావాలి
ఈ మతోన్మాద పాలనకు చరమగీతి పాడాలి.

- బి. దశరథ

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

- మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు నష్టపరిహారం ప్రకటించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్
- మూడోరోజు కొనసాగిన జీపు యాత్ర



ప్రజాశక్తి- గరుగుబిల్లి/పాలకొండ/వీరఘట్టం/సీతానగరం

గిరిజన విద్యార్థుల వరుస మరణాలు ప్రభుత్వం హత్యలేనని, అనారోగ్యంగంతో మృతి చెందిన హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి మృతికి ప్రభుత్వం రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా చేపడుతున్న జీపు యాత్ర శనివారం గరుగుబిల్లి, పాలకొండ, వీరఘట్టం, బలిజిపేట, సీతానగరం మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల మరణాలను నిరసిస్తూ ఆయా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం టి.అఖిల్, మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తక్షణమే ఎన్ఎంలను నియమించాలని, పాఠశాలలు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో 14 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. కురుపాం గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థులకు 16 రూములు ఏర్పాటు చేయడం, అలాగే ఒక రూమ్‌కు 40 మంది విద్యార్థులు ఉంటున్నారని అన్నారు. తరగతులు, వసతి, భోజనాలు ఒకేచోట ఉండడం దారుణమన్నారు. సురక్షితమైన మంచినీరు లేదని, ఆర్వో ప్లాంట్ ఉన్నా పని చేయడంలేదని, మరుగుదొడ్లు కూడా సరిపడా లేవన్నారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ గురుకుల హాస్టల్ లో ఇదే దుస్థితి నెలకొందిని అన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచాలని, అయినా పెంచలేదన్నారు. అలాగే అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్నారు. విద్యార్థులు మరణిస్తే హడావిడిగా హాస్టళ్లను సందర్శించి వారు తప్పును కప్పిపుచ్చుకోడానికి కింద స్థాయి సిబ్బందిపై వేటు వేయడం దుర్మార్గమన్నారు. హాస్టల్లో ఎఎన్ఎం నియమిస్తామని గిరిజనశాఖా మంత్రి ఇచ్చిన హామీ 15నెలలైనా అమలుకాకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎఎన్ఎంలను నియమించాలని, అనారోగ్యంతో మృతి చెందిన 14మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐక్యంగా విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.

బలిజిపేటలో ప్రభుత్వ డిగ్రీకాలేజీ పెట్టాలి

బలిజిపేట : మండల కేంద్రమైన బలిజిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జీపుయాత్ర బలిజిపేటకు శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పచ్చకామెరులతో విద్యార్థులు మరణిస్తున్నారని, శుక్రవారం సీతంపేట మండలం హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి మరణించిందని అన్నారు. విద్యార్థుల ఇలా పిట్టల్లారాలిపోతున్నా గిరిజన శాఖ మంత్రి, ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నష్టపరిహారం ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ బలిజిపేటలో డిగ్రీ కళాశాల పెడతామని చెప్పి గత ప్రభుత్వం ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికి రెండేళ్లవుతున్నా అవుచేయ లేదన్నారు. దీంతో మండలంలో విద్యార్థులు బొబ్బిలి, రాజాం చదువు కోసం వెళ్లాల్సిన పరిస్తితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలోనే బ్రాకిష్ జిల్లాగా పశ్చిమ

ప్రజాశక్తి - భీమవరం

దేశంలోనే పశ్చిమగోదావరి జిల్లాను బ్రాకిష్ జిల్లాగా (ఉప్పునీరు) ఆక్వా సాగుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉప్పునీటి (బ్రాకిష్) ఆక్వా సాగుదారులు తప్పనిసరిగా కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సిఎఎ) కింద రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఎగుమతులకు ఆటంకం లేని యాంటీ బయోటిక్ ఫ్రీ ఆక్వా ఉత్పత్తుల సాగుకు కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం సిఎఎ రిజిస్ట్రేషన్‌కు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సిఎఎ మార్గదర్శకాల మేరకే బ్రాకిష్ ఆక్వా సాగు నిర్వహించాలని, నిబంధనలను పాటించని వారి సాగుకు గుర్తింపు నమోదు చేయకపోవడంతోపాటు చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం రూరల్ మండలాల్లో 17,100 ఎకరాల్లో బ్రాకిష్ ఆక్వా సాగు జరుగుతుందన్నారు. 2005 నుండి 1,880 మంది మాత్రమే సిఎఎ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రస్తుతం సుమారు వంద మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని తెలిపారు. బ్రాకిష్ ఆక్వా సాగు సముద్రం హై టైడ్ నుండి 200 మీటర్లు పరిధిలో నిషేధమన్నారు. వ్యవసాయ భూములకు 50 నుండి 100 మీటర్ల పరిధిలో, తాగునీటి వనరులకు వంద మీటర్ల పరిధిలో, 500 జనాభా కలిగిన ప్రాంతానికి వంద మీటర్ల పరిధిలో, 500కుపైబడి జనాభా కలిగిన ప్రాంతాల్లో 300 మీటర్లు పరిధిలో బ్రాకిష్ ఆక్వా సాగు నిషేధమన్నారు. 2026 జూన్ నాటికి అన్ని ఫార్మ్లు సిఎఎ పరిధిలో నమోదు కావాలని, లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు.

బిటిపి, చాగల్లు రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి-గుమ్మగట్ట

భైరవాని తిప్ప ప్రాజెక్ట్ కు వరద నీరు ఉధృతి ఎక్కువ కావడంతో రెండు గేట్లు ఎత్తినట్లు ఎఇ హరీష్ తెలిపారు ప్రాజెక్టు 1680 అడుగుల నీటిమట్టం సామర్థ్యముండగా ప్రస్తుతం 1652 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. పైనుండి దాదాపుగా 2000 క్యూసెక్కులు నీరు వస్తుండంతో ప్రవాహాన్ని బట్టి డ్యాం పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని స్పిల్ వే వద్ద గల 6 గేటు ఒక్క అడుగు, 7వ గేటు అర్ధఅడుగు ఎత్తి 1314 క్యూసెక్కుల నీటిని క్రిందికి వదులుతున్నట్లు ఎఇ చెప్పారు. వరద ఉధృతిని బట్టి చూస్తే ఆదివారానికి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సందర్శకులు ఎవరు కూడా నీటి ప్రవాహంలో దిగొద్దని, ప్రవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఈశ్వరయ్య సూచించారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చాగల్లు గ్రామ సమీపంలో ఉన్న చాగల్లు ప్రాజెక్టు గేట్లను ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి శనివారం ఎత్తి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్ నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.

పైన ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. దీంతో చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానదికి 250 క్యూసెక్కులు, పెండేకల్లు రిజర్వాయర్‌కు 200 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ లోకనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

పుట్లూరు : మరదలపై బావ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన పుట్లూరు మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

ఎస్.గూడూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ ఆరోగ్యం బాగలేక తాడిపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి చేరుకుంది. అయితే ఇంట్లో భోజనం లేకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న బావ రాజకుల్లాయప్ప ఇంటికి వెళ్లింది. 'అన్నం ఉందా బావా' అని అడగ్గా ఉంది తీసుకుపో అని చెప్పాడు. దీంతో ఇంట్లోకి వచ్చిన మరదలిపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుని పారిపోయింది.

ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి రాజకుల్లాయప్పను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నవజాత శిశువులపై 'తరాల' ప్రభావం

• మరింత సాయాన్ని అనుమతించాలి • గాజా పరిస్థితిపై ఐరాస హెచ్చరిక

న్యూయార్క్ : గాజాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న గర్భిణులు, నవజాత శిశువులపై కొన్ని తరాల పాటు ప్రభావం పడుతుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ అధికారి హెచ్చరించారు. జీవితకాలం ఎదురయ్యే ఆరోగ్య సమస్యల నుంచి వారు బయటపడాలంటే సాయాన్ని మరింత పెంచాలని ఆయన సూచించారు. ఇజ్రాయిల్ విధ్వంసంతో మరుభూమిగా మారిన గాజాలో పర్యటించి వచ్చిన అనంతరం ఐరాస జనాభా నిధి (యుఎన్ఎఫ్‌పిఎ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆండ్రూ సబర్టన్ న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గాజాలో భయానక వాతావరణం నెలకొని ఉన్నదని చెప్పారు. గాజా జనాభాలో నాలుగో వంతు మంది ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. 'ఆకలిలో అల్లాడిపోతున్న వారిలో 11,500 మంది గర్భిణులు కూడా ఉన్నారు. పోషకాహార లోపం తల్లికే కాదు... పుట్టిన నవజాత శిశువులకు కూడా ప్రమాదకరమే' అని సబర్టన్ ఆందోళన వ్యక్తం చేశారు. నవజాత శిశువుల్లో 70 శాతం మంది కుంగుబాటుకు గురయ్యారని, వారు నెలలు నిండకుండానే పుట్టారని చెప్పారు. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఇది 20 శాతంగా మాత్రమే ఉంది. 'పోషకాహార లోపం అనేది తరాల ప్రభావాన్ని చూపుతుంది. తల్లిపైనే కాదు... పుట్టిన బిడ్డపై కూడా ప్రభావం ఉంటుంది. ఇలాంటి వారి ఆరోగ్యం విషయంలో దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిశువు జీవితాంతం ఏదో ఒక సమస్య వస్తూనే ఉంటుంది' అని సబర్టన్ వివరించారు. కాల్పుల విరమణ కారణంగా మానవతాసాయం అందించే సిబ్బంది కదలికలు పెరిగాయని అన్నారు. సహాయ సామగ్రిని పరిమితంగానే అనుమతిస్తున్నారని, అది ఏ మాత్రం చాలదని చెప్పారు.


ఇజ్రాయిల్ దాష్టీకంతో పోషకాహారం అందక అస్థిపంజరంలా ఉన్న గాజా చిన్నారి, ఆమె తల్లి

94 శాతం ఆసుపత్రులు ధ్వంసం

గాజాలో వైద్య సరఫరాలు, సౌకర్యాల కొరత అధికంగా ఉన్నదని సబర్టన్ తెలిపారు. 94 శాతం ఆస్పత్రులు దెబ్బతినడమో లేదా ధ్వంసం కావడమో జరిగిందని, మిగిలిన ఆస్పత్రులు అత్యవసర సేవలు మాత్రమే అందిస్తున్నాయని చెప్పారు. గాజాలో తల్లుల మరణాలు అధికంగా ఉన్నాయని, గర్భ నిరోధకం వంటి కనీస సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడమే దీనికి కారణమని అన్నారు. కొందరు సురక్షితం కాని గర్భవిచ్ఛిత్తిని ఎంచుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. గాజాలో 1.7 లక్షల మందికిపైగా మూత్ర సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో జీవితకాలం ఇబ్బందులు తప్పవని సబర్టన్ హెచ్చరించారు.

విద్యకు దూరమవుతున్న చిన్నారులు

గాజాలో ఇజ్రాయిల్ దళాలు సాగించిన మారణకాండలో 85 శాతం పాఠశాలలు ధ్వంసమయ్యాయి. అక్కడ విద్యా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. ఎక్కడ చూసినా శిథిలాలే కన్పిస్తుండడంతో పిల్లలకు చదువు చెప్పే వారే కరువయ్యారు.

దీంతో ఓతరం విద్యకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని యునిసెఫ్ ప్రాంతీయ డైరెక్టర్ ఎడార్డ్ బెగ్‌బెడర్ జెరుసలేంలో తెలిపారు. ఫిబ్రవరి నాటికి పాఠశాలలు ప్రారంభించని పక్షంలో నాలుగో సంవత్సరంలోకి అడుగు పెట్టినట్టు అవుతుందని, ఓ తరం విద్యకు దూరం కావడానికి అది దారితీస్తుందని ఆయన చెప్పారు. గాజాలో ఎక్కడ చూసినా విధ్వంసమే కన్పిస్తోందని తెలిపారు. తాత్కాలికంగా కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ మూడు రోజుల మాత్రమే చదవడం, రాయడం, గణితం నేర్చుకుంటున్నారని, ప్రాథమిక విద్య అందించాలంటే చేయాల్సింది చాలా ఉన్నదని వివరించారు. ఆ కేంద్రాలలో కూడా కనీస సదుపాయాలు లేవని చెప్పారు. వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ నడుపుతున్న 300 పాఠశాలల్లో 80 పాఠశాలలకు మరమ్మతులు అవసరమని ఆయన తెలిపారు. 'ఆహారం మనుగడ కోసం... విద్య ఆశలు నింపడానికి' అని బెగ్‌బెడర్ వ్యాఖ్యానించారు.

జైపూర్, పట్నా ముందుకు
హర్యానా, యు ముంబ ఔట్..

• ప్రొ కబడ్డీ సీజన్-12



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-12లో జైపూర్ పింక్ ప్యాంథర్స్, పట్నా పైరెట్స్ జట్లు ప్లే-ఆఫ్స్‌లో గెలిచి తర్వాతి రౌండ్‌కు చేరాయి. శనివారం జరిగిన తొలి ప్లే-ఆఫ్‌లో జైపూర్ జట్టు 30-27పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను, రెండో ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ 40-31పాయింట్ల తేడాతో యు ముంబను ఓడించాయి. త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో జైపూర్-హర్యానా జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ నువ్వా-నేనా అన్నట్లు సాగింది. ఒక దశలో ఇరుజట్లు 26-26పాయింట్లతో సమంగా ఉన్నాయి. ఆ దశలో జైపూర్ ఆలౌటై అందరూ ప్లేయర్స్ కోర్టులోకి వచ్చారు. మరో 1.30ని.లో మ్యాచ్ ముగుస్తుందనగా.. జైపూర్ రైడర్లు అద్భుతంగా రాణించారు. వరుసగా నాలుగు పాయింట్లు సాధించి ప్రత్యర్థి జట్టుకు ఒక పాయింట్‌ను మాత్రమే ఇచ్చారు. రెండో మ్యాచ్‌లో పట్నా రైడర్ అయాన్(14) సత్తా చాటాడు. నేడు జరిగే ఎలిమినేటర్-1లో జైపూర్‌తో పట్నా పైరెట్స్ తలపడనుంది.

ప్రొ కబడ్డీలో నేడు

ఎలిమినేటర్-1: పట్నా పైరెట్స్ x జైపూర్ పింక్ ప్యాంథర్స్(రాత్రి 8.00గం॥లకు)
మినీ క్వాలిఫయర్ : బెంగళూరు బుల్స్ x తెలుగు టైటాన్స్(రాత్రి 9.00గం॥లకు)

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ షాకు గురై కార్మికుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో గడ్డిని కోస్తుండగా బియ్యంపేటకు చెందిన దొంగ భీమన్న(46) విద్యుత్ ప్రమా దానికి గురై మృతి చెందాడు. మృతుని కుమారుడు దూడలు వీరబాబు ఈ విషయమై ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : కడప జిల్లా రాజుపాలెం మండలం వెళ్లాల సమీపంలో శనివారం వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గొంగటి రామ సుబ్బారెడ్డి(70), నాగ మునెమ్మ (65) శనివారం వెళ్లాల సమీపంలో ఉన్న కుందూ నదిలో దూకారు. గమనించిన స్థానికులు నదిలో కొట్టుకుపోతున్న భర్తను రక్షించి ఒడ్డుకు చేర్చారు. నాగమునమ్మ గల్లంతయ్యారు. ఆమె కోసం గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు గాలిస్తున్నారు. తహశీల్దార్ రమణారెడ్డి, ఎస్ఐ వెంకట రమణ, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు బంగ్లాతో హర్మన్‌ప్రీత్ సేన నామమాత్రపు మ్యాచ్

• మధ్యాహ్నం 3.00గం॥లకు



నవీ ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ లీగ్ పోటీలు చివరి దశకు చేరాయి. టోర్నీలో భాగంగా మిగిలిన చివరి రెండు లీగ్ మ్యాచ్‌లు ఆదివారం జరగనున్నాయి. విశాఖపట్నంలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య, నవీ ముంబయిలో భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖ మ్యాచ్ ఉదయం 11.00గం॥లకు, నవీ ముంబయి మ్యాచ్ మధ్యాహ్నం 3.00గం॥లకు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌ల ఫలితాలకు సంబంధం లేకుండానే ఇప్పటికే సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. టీమిండియా సెమీస్ ప్రత్యర్థి ఎవరో కూడా తేలిపోవడంతో ఈ మ్యాచ్ ఫలితాలు ఎలా ఉన్నా.. సమీకరణలు ఏమీ మారవు. టీమిండియా ఆదివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీస్‌కు ముందు జరిగే ఈ మ్యాచ్‌లో గెలుపుతో ఆసీస్‌తో పోరుకు సిద్ధమవ్వాలని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు ఈ టోర్నీలో ఆడిన ఆరు మ్యాచుల్లో కేవలం పాకిస్తాన్‌పై విజయం సాధించి మిగిలిన ఐదు మ్యాచుల్లో ఓటమిపాలై టోర్నీనుంచి ఇప్పటికే నిష్క్రమించింది. న్యూజిలాండ్‌తో జరిగిన కీలక పోరులో టీమిండియా బ్యాటర్లు మంధాన, ప్రతిక రావల్ సెంచరీలతో అదరగొట్టారు. జెమిమా రోడ్రిగ్స్ కూడా ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. ఈ క్రమంలో భారతజట్టు గెలుపుతో సెమీస్ పోరుకు సిద్ధం కావాలని చూస్తోంది.

జట్లు(అంచనా)...

భారత్: ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్.
బంగ్లాదేశ్: నిగర్ సుల్తానా(కెప్టెన్, వికెట్ కీపర్), ఫర్హానా, హైదర్, షర్మిన్ అక్తెర్, శోభన, శోమా అక్తర్, రితు మోని, రుబెనా ఖాన్, నహిదా అక్తెర్, మరూఫా, ఫరీహా.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట, గోకవరం, పెరవలి

జగ్గంపేట మండలంలోని సీతారాంపురంలో కోడి పందేలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ వెల్లడించారు. గోకవరం మండలం మల్లవరంలో కోడిపందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కొత్తపల్లిలో బొమ్మా బొరుసు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నారు. పెరవలి మండలం కాపవరంలో పేకాడుతున్న ఆరుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5120 నగదు, కొత్తపల్లి అగ్రహారంలో పేకాడుతున్న ఐదుగురు వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

నీటి మీద లెక్కలు

• హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి పిఎబిఆర్‌కు 6 టిఎంసిలట!
• నిల్వ ఉన్నదే 5.44 టిఎంసిలు
• ఐఎబిలో అధికారుల లెక్కల్లో తేడాలు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా నుంచి పెన్నహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయరుకు 6.182 టిఎంసిల నీరు ఇచ్చామని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. ఇది కాకుండా హెచ్ఎల్ఎంసి నుంచి 2.746 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అయితే ఆ డ్యామ్‌లో నీటి నిలువ ప్రస్తుతమున్నది 5.44 టిఎంసిలు మాత్రమే. దీని నుంచి ఇతర పంటలకేమైనా ఇచ్చారంటే అదీ లేదు. ఇటీవలి కాలంలో కొద్ది రోజులు విద్యుత్ ఉత్పత్తికి వాడారు. 220 క్యూసెక్కులు మాత్రమే ఈ డ్యామ్ నుంచి అవుట్‌ఫ్లో ఉన్నాయి. ఇలాగుంటే ఈ డ్యామ్‌లో గతేడాది సంబందించి నీటి నిలువలున్నాయి. అంటే తుంగభద్ర డ్యామ్, ఇటు హంద్రీనీవా నీళ్లు జిల్లాకు రాకముందే అంటే జులై 17కు ముందే పిఎబిఆర్ డ్యామ్‌లో 1.92 టిఎంసిల నీళ్లు నిలువ ఉంది. దాదాపు రెండు టిఎంసిల నీళ్లు ఉన్నాయి. ఇప్పుడు తుంగభద్ర, అటు హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు కలిపితే మొత్తం ఈ డ్యామ్‌లో ఎనిమిది నుంచి తొమ్మిది టిఎంసిల నీళ్లు నిలువ ఉండాలి. కాని ప్రస్తుతం ఈడ్యామ్‌లో 5.44 టిఎంసిలు మాత్రమే నిలువ ఉంది. ఈ లెక్కల్లో తేడాలు ఎందుకున్నాయన్నది తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

మిడ్‌పెన్నార్ పరిస్థితి అదే తీరు

జిల్లాల్లో హెచ్ఎల్ఎంసిపైనున్న మరో ప్రాజెక్టు మిడ్ పెన్నార్. దీని పూర్తి నిలువ సామర్థ్యం 5.17టిఎంసిలయితే ఇప్పటి వరకు నిలువ ఉన్నది 2.86 టిఎంసిలు మాత్రమే. అంటే 55 శాతం మాత్రమే నీరు నిలువ ఉంది. దీని నుంచి 980 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉంది. ఈ డ్యామ్‌లోనూ సీజన్ ఆరంభానికి ముందు 0.39 టిఎంసిలే నీరు ఉండేది. ఇక్కడ మాత్రం 2.50 టిఎంసిల వరకు హెచ్ఎల్‌సి నీరు వచ్చినట్టు కనిపిస్తోంది. అయితే పూర్తిగా ఇప్పటి వరకు ఇచ్చిన 16 టిఎంసిల్లో ఎక్కడా వినియోగంపై సరైన స్పష్టతను సాగునీటి సలహా మండలి సమావేశంలో తేల లేదు.

హెచ్ఎల్‌సి నీటి వినియోగంపైనా అనేక సందేహాలు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఈ ఏడాది 24 టిఎంసిలు కేటాయించారు. ఇందులో 14.068 టిఎంసిల్లో పది టిఎంసిలకు తాగునీటి అవసరాలకు కేటాయించారు. ఈ కేటాయించిన దానిలో 7.847 టిఎంసిలు ప్రవాహ నష్టం కింద లెక్కవేశారు. ఇవిపోనూ 9.481 టిఎంసిలు సాగునీటికి, 6.740 టిఎంసిలు తాగునీటికి అన్నారు. ఇందులో ఇప్పటి వరకు 16 టిఎంసిలు నీళ్లు జిల్లాకు వచ్చాయి. ఇక ఎనిమిది టిఎంసిలు మాత్రమే రావాల్సి ఉంది.

ఈ నీళ్లు జనవరి ఆఖరు వరకు రావాల్స ఉంటుంది. ఇప్పుడొస్తున్న ప్రవాహం ప్రకారమైతే మరో 40 రోజుల్లో జిల్లాకు వచ్చే నీరు ఆగిపోనుంది. పంటల ప్రకారం చూస్తే జనవరి ఆఖరు వరకు నీరు అవసరమవుతుంది. దీన్ని ఏ రకంగా సర్దుబాటు చేయాలన్నది నీటిపారుదల అధికారులు తేల్చాల్సుంది.

నీటి లెక్కల్లో తేడాలెందుకు..?

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా వచ్చిన 17 టిఎంసిలు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా వచ్చిన ఆరు టిఎంసిలు కలిపి మొత్తం 23 టిఎంసిలొచ్చాయి. ఇందులో ఈ నీటి వినియోగంపై సరైన స్పష్టత లేదు. అందుకే సాగునీటి సలహామండలి సమావేశంలోనే తేడాలు గమనించిన నేతలు మరోమారు అధికారులు సమావేశమై నిర్ధిష్టమైన ప్రణాళికతో రావాలని సూచించారు. అనంతపురం జిల్లా ప్రాజెక్టుల్లో అత్యంత ప్రధానమైనది పిఎబిఆర్ డ్యామ్. ఈ డ్యామ్‌కు వచ్చిన నీటి లెక్కల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముందుగానున్న 1.92 టిఎంసిలు, హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు, ఇప్పుడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచి వచ్చిన నీరు కలిపితే తొమ్మిది టిఎంసిల నీళ్లు ఆ డ్యామ్‌లో ఉండాల్సుంది. కాని సగమే ఉండటం గమనార్హం.

ఉత్తరప్రదేశ్‌లో దారుణం జర్నలిస్టు దారుణ హత్య

యుపి : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దారుణం జరిగింది. జర్నలిస్టు లక్ష్మీ నారాయణ్ సింగ్ అలియాస్ పప్పు సింగ్ (54)ను దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. నగరంలోని ఓ హోటల్ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ సింగ్ కు మేనల్లుడు. పప్పు సింగ్‌పై కత్తులతో దాడి చేసిన నిందితులు ఆయన మెడ, పొట్ట, చేతులపై విచక్షణ రహితంగా పొడిచారు. ఆయన శరీరంపై 24 కు పైగా లోతైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆయన్ను వెంటనే స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్ది రోజుల క్రితం వ్యతు కి, నిందితులకు మధ్య ఓ వివాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని అదనపు పోలీస్ కమిషనర్ అజయ్ పాల్ శర్మ తెలిపారు. ఈ కేసులో నిందితుడు విశాల్‌ను అరెస్టు చేశామని, ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామని ఆయన చెప్పారు.

థాయ్‌లాండ్ మాజీ రాణి సిరికిట్ మృతి

థాయ్‌లాండ్ : థాయ్‌లాండ్ మాజీ రాణి సిరికిట్ (93) దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో శుక్రవారం రాత్రి చులాలాంగ్‌కోర్న్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణించినట్లు థాయ్‌లాండ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 1932 ఆగస్టు 12న జన్మించిన సిరికిట్ 18 ఏళ్ల వయసులో చక్రి వంశానికి చెందిన భూమిబోల్ అదుల్యాదేజ్‌ను వివాహం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత కాలం సేవలందించిన రాజిగా పేరు పొందారు. 2016లో ఆమె భర్త భూమిబోల్ మరణం తర్వాత వారి కుమారుడు మహా వజిరాలాంగ్‌కోర్న్ రాజుగా బాధ్యతలు స్వీకరించారు.

యుపిలో పెన్షన్ నిధుల కుంభకోణం!

- మృతుల పేర్లతో రూ.43 కోట్లు స్వాహా
- ట్రెజరీ సిబ్బంది చేతివాటం
- 97మందిపై కేసులు నమోదు



లక్నో : అవినీతి రహిత పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ఏలుబడిలో చావకింద నీరులా సాగిపోయిన రూ.43 కోట్ల పెన్షన్ నిధుల కుంభకోణం తాజాగా వెలుగుచూసింది. చిత్రకూట్ జిల్లాలో చనిపోయిన దాదాపు 90మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పేర్లతో ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. దీనిపై జరిగిన దర్యాప్తులో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. చనిపోయిన పెన్షనర్ల ఖాతాలను రీ యాక్టివేట్ చేసి వాటి ద్వారా కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను కొల్లగొట్టారని తేలింది. ఒక్కో ఖాతాలో రూ.2 కోట్ల నుండి రూ.4 కోట్లు వచ్చాయి. పదేళ్లకు పైగా ఈ కుంభకోణం చాప కింద నీరులా సాగింది. దర్యాప్తు జరిపిన అనంతరం ఇందుకు సంబంధించిన 97మందిపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు దాఖలు చేసింది.

వీరిలో జిల్లా ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు కొందరు వున్నారు. ఈ దర్యాప్తు అంతా కూడా చాలా రహస్యంగా సాగింది. కుంభకోణ సూత్రధారుల్లో ఒకరుగా భావిస్తున్న అసిస్టెంట్ ట్రెజరర్ సందీప్ కుమార్ శ్రీవాస్తవ ఈ నెల 19న చనిపోవడంతో, ఈ విషయాలు బయటకు వచ్చాయి.

శ్రీవాస్తవను ప్రత్యేక దర్యాప్తు బృందం పిలిచి విచారించింది. దర్యాప్తు సమయంలో ఆయన ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే అలహాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ అదే రోజున గుండెపోటుతో ఆయన మరణించారు. ఈ నిధుల స్వాహా 2014లోనే ప్రారంభమైంది, 2018 తర్వాతనే గరిష్ట మొత్తాలు విత్‌డ్రా చేశారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపారు.

కుంభకోణం జరిగిందిలా...

ట్రెజరీ అధికారులే 90 కొత్త బ్యాంక్ ఖాతాలు తెరిచారు. కొన్నిసార్లు చనిపోయిన పెన్షనర్ల కుటుంబ సభ్యులతో వారు కుమ్మక్కయ్యారు. నకిలీ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించి మరీ ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. పెన్షన్ మొత్తాలను ఆన్‌లైన్‌లో ట్రెజరీ నుండి ఆయా ఖాతాలకు బదిలీ చేసేవారు. ఒకోసారి అసలు పెన్షన్ మొత్తాలకన్నా కూడా ఇది ఎక్కువుండేది. ఆ తర్వాత కుంభకోణ సూత్రధారులు ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేవారు. వాటితో ఇల్లు కట్టుకోవడం, కార్లు కొనుక్కోవడం చేశారని ఆ అధికారి వెల్లడించారు. ఈ విషయాలు బయటకు పొక్కగానే చనిపోయిన పెన్షనర్లకు కుటుంబ సభ్యులు కొందరు ఇక్కడ ఖాతాలు వేసుకుని పారిపోయారని చెప్పారు.

2018లో తమ కుటుంబ సభ్యులు మరణించిన మూడు మాసాల తర్వాత నలుగురు పెన్షనర్ల ఖాతాలు తిరిగి ప్రారంభించారు. వాటిల్లోకి పెద్ద మొత్తంలో డబ్బులు పడినట్లు ఆడిట్ నివేదికల్లో కనుగొన్నారని దైనిక్ జాగరణ్ నివేదిక పేర్కొంది. అంతర్గత ఆడిట్‌లో అవకతవకలను కనుగొన్న అనంతరం సీనియర్ ట్రెజరీ అధికారి రమేష్ సింగ్‌పై ఈ నెల 17న ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు. నలుగురు ట్రెజరీ సిబ్బంది 93మంది ఖాతాదారుల పేర్లను ఈ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు.

అప్పుడే తెలిసినా..

2015లో మొదటిసారిగా కుంభకోణం గురించి కనుగొన్నారు. చిత్రకూట్‌లోని ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరు అకౌంటెంట్లను సస్పెండ్ చేశారు. అంతకుమించి తదుపరి విచారణ జరపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

దర్యాప్తు చేస్తున్నాం : సిట్

సిట్‌కు నాయకత్వం వహించిన సర్కిల్ అధికారి సందీప్ కుమార్ వర్మ మాట్లాడుతూ, చాలామందికి తమ పేర్లతో బ్యాంక్ ఖాతాలు తెరిచినట్లు, వాటిని ట్రెజరీ అధికారులు ఉపయోగిస్తున్నట్లు తెలియదన్నారు. ఎంతమంది ఖాతాదారులు తమ అకౌంట్లను తామే ఆపరేట్ చేసుకుంటున్నారో ప్రస్తుతం విచారిస్తున్నామని చెప్పారు. వాస్తవ పెన్షన్ మొత్తాల కన్నా ఎక్కువ మొత్తం ఆ ఖాతాల్లో ఎలా పడిందనే అంశంపై ప్రధానంగా దర్యాప్తు సాగిస్తున్నామన్నారు. నకిలీ లైఫ్ సర్టిఫికెట్లు ఎలా సేకరించారు, వాటిని ఆమోదించింది ఎవరో తెలుసుకుంటున్నామని చెప్పారు.

ఐర్లాండ్ కొత్త అధ్యక్షురాలుగా కేథరిన్ కొన్నోలీ

- భారీ మెజార్టీతో వామపక్ష నేత విజయం



డబ్లిన్ : ఐర్లాండ్ దేశాధ్యక్షురాలుగా కేథరిన్ కొన్నోలీ ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికలు నిర్వహించగా, శనివారం నాడు ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి కొన్నోలీ తన ప్రత్యర్థి హంఫ్రీస్‌పై స్పష్టమైన మెజార్టీ సాధించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కొన్నోలీకి ప్రధాన వామపక్ష పార్టీలు, గ్రీన్ పార్టీ, సిన్ ఫెయిన్ పార్టీలు మద్దతిచ్చాయి. రైట్ వింగ్ పార్టీలైన ఫైన్ గేల్, ఫియాన్నా ఓటమిని అంగీకరించాయి. మొదటి రౌండ్ లెక్కింపులో కార్క్ సౌత్, సెంట్రల్ నియోజకవర్గంలో కొన్నోలీకి 64.7% ఓట్లు వచ్చాయని, ప్రత్యర్థి హెథర్ హంఫ్రీస్‌కు 28.2%, మరో అభ్యర్థి జిమ్ గావిన్‌కు 7.1% ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆమె ఆధిక్యత కనబరిచారు. కొన్నోలీ ప్రముఖ న్యాయవాది. 2016లో మొదటిసారి శాసన సభకు ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను నిరసించగా విమర్శిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. విద్య, ఉద్యోగం వంటి విషయాలు ప్రస్తావిస్తూ యువతకు చేరువయ్యారు. సోషల్ డెమొక్రాట్ అండ్ లేబర్ పార్టీ (ఎస్‌డిఎల్‌పి) నాయకులు క్లైర్ హన్నా నూతన అధ్యక్షురాలు కొన్నోలీకి అభినందనలు తెలిపారు. కొన్నోలీ నాయకత్వంలో ఈ ద్వీపానికి ప్రపంచ వేదికపై ప్రాముఖ్యత పెరగాలని, శక్తివంతమైన దేశంగా తయారవ్వాలని ఆమె ఆకాంక్షించారు. కొన్నోలీ విజయం ఐర్లాండ్ విజయంగా ఉప ప్రధాన మంత్రి సైమన్ హారిస్ అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో చెల్లని ఓట్లు గణనీయంగా పెరిగాయి. ముగ్గురు అభ్యర్థులనూ తిరస్కరిస్తూ ప్రజలు అధిక సంఖ్యలో చెల్లని ఓట్లు వేయడం గమనార్హం.

వచ్చే వారంలో ట్రంప్, జిన్‌పింగ్ భేటీ?

- కౌలాలంపూర్‌లో ఇరు దేశాల ఆర్థికశాఖ అధికారుల సమావేశం
- వాణిజ్య యుద్ధం నివారించేందుకు చర్చలు

కౌలాలంపూర్ : వచ్చే వారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశం జరగవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కౌలాలంపూర్‌లో ఇరు దేశాల ఆర్థిక శాఖాధికారులు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం పెచ్చరిల్లకుండా నివారించేందుకు గానూ చర్చలు తీసుకువడానికి ఈ సమావేశం జరుగుతోంది. వచ్చే గురువారం దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా ట్రంప్, జిన్‌పింగ్‌లు భేటీ కావడానికి మార్గం సుగమం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అరుదైన ఎర్త్ మాగ్నెట్స్, ఖనిజాలపై చైనా ఎగుమతుల ఆంక్షలు విస్తరించడంతో అందుకు ప్రతిగా నవంబరు 1 నుండి చైనా ఉత్పత్తులపై కొత్తగా వంద శాతం టారిఫ్‌లు, ఇతర వాణిజ్య ఆంక్షలు విధించనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. టారిఫ్‌లపై, వాణిజ్యంపై తాత్కాలికంగానైనా ఒక ఒప్పందం కుదరాలన్నది లక్ష్యంగా వుంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు అలాగే కొనసాగుతున్నాయి.

ఆసియా దేశాల్లో ట్రంప్ టూర్

మలేషియా, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో ఐదు రోజుల పాటు ట్రంప్ పర్యటించనున్నారు. ఇందుకోసం శుక్రవారం రాత్రి వాషింగ్టన్ నుండి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనను వైట్‌హౌస్ గురువారం ప్రకటించినప్పటికీ, ట్రంప్, జిన్‌పింగ్ సమావేశంతో సహా పలు అంశాలపై స్పష్టత లేదు. తాత్కాలిక ఒప్పందమన్నా కుదిరితే టారిఫ్ విషయంలో చైనాకు, ఎర్త్ మాగ్నెట్ల విషయంలో అమెరికాకు ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు.

ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ ఉద్యోగం

- 20 రోజుల్లో చట్టం,
- 20 నెలల్లో నియామకాలు
- తేజస్వియాదవ్



సభలో మాట్లాడుతున్న తేజస్వి యాదవ్

పాట్నా : బీహార్‌లో ఇండియా బ్లాక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లో చట్టం చేస్తామని, 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని ఆర్‌జెడి నేత, సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ హామీ ఇచ్చారు. ఝూర్ఖండ్ జిల్లాలోని గోగ్రిలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. బీహార్‌ను నెంబర్ 1గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. అందుకోసం విద్యారంగాన్ని ప్రోత్సహిస్తామని, సరైన ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తామని, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యమని స్పష్టం చేశారు. అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన వివిఐ నాయకుడు ముఖేష్ సహానీని ఉపముఖ్యమంత్రిగా ప్రకటించడాన్ని బిజెపి పదేపదే ప్రశ్నించడం ఆ బీసీల పట్ల ఆ పార్టీకి ఉన్న ద్వేషాన్ని వెళ్లగక్కుతుందని ఆయన విమర్శించారు. ఈ పరిణామంతో అమిత్‌షా ఆసహనానికి గురవుతున్నారని చెప్పారు.

12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడున్నాయి? : రాహుల్‌గాంధీ

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. బీహార్, జార్ఖండ్‌తోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి పనుల కోసం వలస వెళ్లిన ప్రజలు ఛట్ పండుగ కోసం ఇళ్లకు చేరతారు. వారు రైళ్లు లేకపోవడంతో రైల్వే స్టేషన్లలో పడిగాపులు కాస్తున్నారు. రైళ్ల కిక్కిరిసిపోవడంతోపాటు తోపులాటలు జరుగుతున్నాయి. 'పండుగల సందర్భంగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడ ఉన్నాయి? ప్రతి సంవత్సరం పరిస్థితి ఇలాగే ఎందుకు ఉంటుంది? దిగజారిపోతున్నాయి? 200 శాతం పైగా సామర్థ్యంతో రైళ్లు కిక్కిరిసి, ప్రజలు తలుపుల్లో, పైకప్పుల్లో వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. బీహార్ ప్రజలు ఏటా ఇలాంటి అవమానకరమైన పరిస్థితుల్లో ఇంటికి తిరిగి వచ్చేలా ఎందుకు నెట్టబడుతున్నారు? రాష్ట్రంలోనే ఉద్యోగం, గౌరవప్రదమైన జీవితం ఉంటే.. వారు వేల కిలోమీటర్ల దూరం తిరగాల్సిన అవసరం ఉండేది కాదు కదా. సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రయాణం ఒక హక్కు. ఆదేదో ఉపకారం కాదు' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రయాణికులంతా ఎన్‌డిఎ మోసపూరిత విధానాలకు, ఉద్దేశాలకు సజీవ సాక్ష్యమని తెలిపారు.


అబద్ధపు హామీ ఇచ్చిన ఎన్‌డిఎ : లాలూప్రసాద్ యాదవ్

దేశంలో నడుస్తున్నదే 13,198 రైళ్లు అని, వీటిలో ఛట్ పండగ బీహార్‌కి 12 వేల రైళ్లు నడిపిస్తామని ఎన్‌డిఎ చెప్పిన హామీ.. అబద్ధపు హామీ అని ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు.

అమిత్ షా అవాకులు

ప్రతిపక్ష ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి కాలం నాటి ఆటవిక పాలన వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

ఝూర్ఖండ్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. బీహార్‌ను ఎన్‌డిఎ సర్కారు అభివృద్ధి పథంలో నడిపించిందని,



సభలో మాట్లాడుతున్న అమిత్‌షా

మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. అవినీతికి పాల్పడని నరేంద్రమోదీ, నితీశ్‌కుమార్‌లతోనే బీహార్ అభివృద్ధి సాధ్యమని అన్నారు.



క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్

అమెరికా ఆంక్షలకు మెజారిటీ దేశాలు వ్యతిరేకం

- క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్

న్యూఢిల్లీ : క్యూబాపై అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా భారతీసహా మెజారిటీ దేశాలు ఓటు వేస్తాయని భావిస్తున్నట్లు మనదేశంలోని క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్ చెప్పారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమపై తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ క్యూబా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దీనిపై ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న అసెంబ్లీ చర్చిస్తుంది. క్యూబాపై అమెరికా ఆంక్షలు కనబరుస్తున్న ప్రభావం మరోసారి చర్చకు రానుంది. చర్చ అనంతరం జరిగే ఓటింగ్‌లో తమకు మిత్రదేశమైన భారత్ సహా మెజారిటీ దేశాలు తమకు అనుకూలంగా ఓటు వేస్తాయని భావిస్తున్నట్లు భారత్‌లో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్ వ్యాఖ్యానించారు. ఇలా క్యూబా తీర్మానాన్ని ప్రవేశపెట్టడం ఇది 33వ సారి. గతేడాది 183 దేశాలు తమ తీర్మానాన్ని బలపరిచాయన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ మాత్రమే వ్యతిరేకించాయని, అజ్జాదావిగ్రైజ్జారెండని చెప్పారు. ఆ తీర్మానం కాపీని ఇప్పటికే జనరల్ అసెంబ్లీకి పంపించినట్లు తెలిపారు. ప్రతిరా సమావేశంలో ఆయన చూపించారు. గత 65 సంవత్సరాలుగా క్యూబాపై అమెరికా అమలు చేసే ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య ఆంక్షలు రాజకీయ కారణాలతో ప్రేరేపించబడ్డవేనని విమర్శించారు. వాటి ఫలితంగానే క్యూబా అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. క్యూబాకు విదేశీ ఆదాయ వనరులు లేకుండా చేయాలన్నదే ఈ ఆంక్షల ప్రధాన లక్ష్యమని ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా తీర్మానం పేర్కొంది. అమెరికా సహా ఇతర దేశాల నుండి వచ్చే పర్యాటక ఆదాయాన్ని దెబ్బతీయడం, అంతర్జాతీయ వైద్య రంగంలో సహకారాన్ని నాశనం చేయడం, ఇంధన సరఫరాలను అడ్డుకోవడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అడ్డగించడం వంటి లక్ష్యాలతోనే అమెరికా ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఆ తీర్మానం వివరించింది.

దళిత వృద్ధురాలిపై సర్పంచ్ భర్త దాడి

- మధ్యప్రదేశ్‌లో ఘోరం

మధ్యప్రదేశ్ : గృహ నిర్మాణ పథకంలో ఇల్లు కేటాయిస్తానని లంచంగా తీసుకున్న రూ.10 వేలు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు 74 ఏళ్ల దళిత మహిళను సర్పంచ్ భర్త తీవ్రంగా కొట్టిన సంఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. నివారీ జిల్లా పృథ్వీపూర్ జనపద్ పరిధిలోని మనేత గ్రామానికి చెందిన దళిత మహిళ శాంతి అహిర్వార్ రూ.10 వేలు లంచంగా ఇచ్చినా ఇల్లు రాకపోవడంతో సర్పంచ్ భర్త రాజ్‌కుమార్ సాహూను ప్రశ్నించింది. ఆగ్రహానికి లోనైన సర్పంచ్ భర్త ఒక చేత్తో ఆమె రెండు చేతులను పట్టుకుని, మరో చేత్తో ఆపకుండా చెంపదెబ్బలు కొట్టాడు. ముసలావిడ అనే కనికరం లేకుండా చేయి మెలేసి, కింద పడేసి, తన్ని తీవ్రంగా హింసించాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

నేపాల్‌లో జీపు బోల్తా : 8 మంది మృతి

ఖాట్మాండు : నేపాల్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. కర్నాలి ప్రావిన్స్‌లోని కొండపైకి 18 మంది ప్రయాణికులతో వెళుతున్న జీపు అదుపుతప్పి 700 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించగా, ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతులంతా 15 నుంచి 30 ఏళ్లలోపు వారే. మరో 10 మంది గాయాల పాలయ్యారని చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఖాట్మాండుకి పశ్చిమాన దాదాపు 500 కి.మీ దూరంలో ఉన్న రుకుమ్ వెస్ట్ జిల్లాలోని బాఫికోట్‌లోని ఛుర్గాబ్ ప్రాంతంలో జరిగింది. జీపు ముసికోట్‌లోని ఖలంగా నుండి అత్బిస్కోట్ మునిసిపాలిటీలోని సయాఖాడి ప్రాంతం వైపు వెళుతుండగా, డ్రైవర్ అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు.

ఉక్రెయిన్‌లో పేలుడు : నిందితుడుసహా నలుగురు మృతి

కీవ్ : ఉక్రెయిన్ నుండి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి తనను తాను పేల్చివేసుకోవడంతో ఆ వ్యక్తితో పాటు మరో ముగ్గురు మరణించారని స్థానిక అధికారులు తెలిపారు. ఓవ్‌రుచ్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సంబంధిత డాక్యుమెంట్ల తనిఖీలు సాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్లాట్‌ఫారంపై వున్నవారిలో బెలారస్‌కు గల సరిహద్దు ప్రాంతానికి వెళ్లేందుకు వచ్చిన వ్యక్తి ఆసుపత్రిగా ఆ వద్ద వున్న పేలుడు పదార్థాన్ని బయటకు తీసి పేల్చాడని అధికారులు తెలిపారు. బోర్డర్ గార్డుసహా ముగ్గురు మహిళలు ఈ పేలుడులో మరణించారు. అనుమానితుడు ప్రాథమిక చికిత్స అనంతరం మరణించాడని ఉక్రెయిన్ సరిహద్దు భద్రతా దళాలు తెలిపాయి. 2022లో రష్యాతో యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో 18 నుండి 22 ఏళ్ల వయసున్న వారు విదేశాలకు వెళ్లడానికి అనుమతి లేకుండా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆంక్షలు విధించారు.



అల్జీరియా - ఫ్రెంచ్ కళాకారిణి హనన్ బెనామర్



కోచి ఆర్ట్ గ్యాలరీలో చించివేతకు గురైన పెయింటింగ్

కోచి ఆర్ట్ గ్యాలరీలో పెయింటింగ్‌పై దాడి

- ఖండించిన సహమత్, లలిత కళా అకాడమీ

కోచి : అసహనం పెచ్చుమీరుతోంది. కోచిలోని దర్బార్ హాల్ ఆర్ట్ గ్యాలరీలో అల్జీరియా - ఫ్రెంచ్ కళాకారిణి హనన్ బెనామర్ చిత్రించిన పెయింటింగ్‌ను చించివేసిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కేరళ పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. 'హింసాత్మక అసహన చర్య'గా ఈ ఘటనను కేరళ లలితకళా అకాడమీ అభివర్ణించింది. కోచికి చెందిన శిల్పి హోచ్ హోచిమిన్, ఆయన సహచరుడు సుధాంశు రాత్రి 7గంటల సమయంలో గ్యాలరీలోకి ప్రవేశించి 'గో ఈట్ యువర్ డాడ్' శీర్షికతో గల లినోకట్ ప్రింట్‌ను చించివేశారు. పైగా ఈ చర్యను ఫేస్‌బుక్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అకాడమీ సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో ఈ కళాఖండాన్ని ప్రదర్శించారు. ఆ ఆర్ట్ వర్క్ పక్కన మలయాళంలో రాసి వున్న పదాలు అసభ్యకరమైనవని, బహిరంగ ప్రదర్శనకు అనుచితమైనవని కావాలని అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రూపునకు చెందిన కళాకారులు అన్నారు. ఈ వర్క్ పక్కనే కళాకారిణి నోట్ కూడా వుంది. నార్వేలోని మితవాద గ్రూపు నుండి ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో తాను ఎదుర్కొన్న వర్గ వివక్ష, జాతీయవాద వ్యాఖ్యలను, విదేశీయులను ద్వేషించే వారి వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రస్తావించడానికి ఇది ఉద్దేశించబడిందని వివరణ ఇస్తున్న నోట్ కూడా వుంది. బెనామర్ తన కళాపాలను అంతర్జాతీయంగా ప్రదర్శించినా, ఎక్కడా విధ్వంసం చోటు చేసుకోలేదు.

చర్యకు ముందుకు వస్తే సంతోషించేదాన్ని : బెనామర్

ఆ వ్యక్తులు విధ్వంసం చేయకుండా చర్చలకు ముందుకొస్తే సంతోషించే దాన్నని అల్జీరియా - ఫ్రెంచ్ కళాకారిణి బెనామర్ చెప్పారు. వారి అభిప్రాయాలను తాను గౌరవిస్తానని, ఈ పద్ధతి సరైంది కాదని అన్నారు.

నిరసన కాదు, విధ్వంసం : లలిత కళ అకాడమీ

ఇది నిరసన ప్రదర్శించడం కాదని, విధ్వంసమని కేరళ లలిత కళ అకాడమీ ఛైర్‌పర్సన్ మురళి చీరోత్ వ్యాఖ్యానించారు. అసంగీకారయోగ్యమైనా వుంటే అది చర్చలకు దారి తీయాలని, వినాశనానికి కాదని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు.

సహమత్ ఖండన

కోచిలోని ఎగ్జిబిషన్‌లో ఆర్ట్ వర్క్‌ను విధ్వంసం చేయడాన్ని సఫ్దర్ హష్మి మెమోరియల్ ట్రస్ట్ సహమత్ తీవ్రంగా ఖండించింది. తన కళారూపానికి జరిగిన విధ్వంసాన్ని వీడియో తీసి మరీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తాజా ఘటనలో ఈ దాడికి పాల్పడింది ఒక కళాకారుడని, అది కూడా సహనానికి, ప్రగతిశీల సంస్కృతికి నెలవైన కేరళలో చోటుచేసుకోవడం దిగ్భ్రాంతిని కలిగిస్తోందని పేర్కొంది. ఇందుకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది.

మంత్రి ఇలాకాలో కంచాలు కరువు!

(మొదటిపేజీ తరువాయి)

మిరప, పోపులు వంటివి మచ్చుకు కూడా కనిపించలేదు. ఇక గుడ్డు చూడగానే నూనెలో వేసి వేయించినట్లుగా కనపడింది. కానీ, కాదు.. అలా కనిపించేందుకు పసుపు నీళ్లలో ఉడకబెట్టి ఇచ్చారు! 'ఎప్పుడూ ఇలానే ఇస్తారా?' అన్నది విద్యార్థుల మాట! ఇంతకూ అవసరమైన నూనె సరఫరా అవుతోందో లేదో! అక్కడే రెండు నాయుళ్లు, బీటలు వారుతున్న ఒక శిథిల భవనంలో వంటలు వండుతున్నారు. విద్యార్థులు తింటే ఆ భవనంలో తినాలి... లేకపోతే ఆరుబయట తినాలి! శిథిల భవనంలో తినడానికి భయపడుతున్న చిన్నారులు ఆరుబయటకే మొగ్గు చూపుతున్నారు. ఆరుబయలు కాబట్టి కుక్కలు వచ్చి చేరుతాయి... అలాగే తినాలి! అవి అరిచినా... కరిచినా సర్దుకుపోవాలి.. తప్పదు! ఈ పరిస్థితుల్లో విద్యార్థులు పోషకాహారం లోపం, రక్తహీనత వెంటాడుతోంది! జ్వరాలతో బాధపడుతున్నారు. గత గురువారం కూడా ఐదుగురు ప్రవీణ్ సహా ఎనిమిది మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు.

నెల రోజుల క్రితం బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లిన గెమ్మెల సునీల్ పాముకాటుకు గురికావడంతో విజయనగరంలోని ఆస్పత్రికి హడావుడిగా తీసుకెళ్లి వచ్చిందని, పర్మినెంట్ ఎఎన్ఎం లేకపోవడంతో వాలా అవస్థలు ఎదుర్కొన్నామని, వర్షిందని వసతి గృహం నిర్వాహకులు 'ప్రజాశక్తి'కి ఏడుస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వసతి గృహంలో 320 మంది బాలురు ఉన్నారు. 3, 4వ తరగతుల విద్యార్థులకు రూ.1,150, 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,400 చొప్పున మెనూ ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ లెక్కన పూటకు రూ.13 మాత్రమే. ఈ సొమ్ముతో నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం ఎలా పెట్టగలరో ప్రభుత్వానికే తెలియాలి.

మెను ఛార్జీల్లో కోత పెట్టి సర్దుబాటు చేస్తున్నాం...

ఈ వసతి గృహంలో ఎఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. దీంతో, విద్యార్థులు అనారోగ్యం బారిన పడినప్పుడు ఇబ్బంది పడుతున్నారు మాట వాస్తవమే. ఈ సమస్యను అధిగమించేందుకు నెలకు రూ.6 వేలు చేతి డబ్బులు పెట్టి ఒక ఎఎన్ఎంను నియమించాం. అస్వస్థతకు లోనవుతున్నప్పుడు ఛార్జీలు, ఇతర ఖర్చులు కూడా ఇవ్వాల్సి వస్తున్నప్పుడు తలకు మించిన భారం అవుతోంది. వసతి గృహంలో ఒకే ఒక్క కుక్ ఉన్నారు. అదనంగా ఇద్దరు వంట మనుషులను నియమించుకుని, వీరికి కూడా చెరో రూ.5 వేలు మేమే ఇచ్చుకుంటున్నాం. నెలకు రూ.16 వేలు వారైనా భరించాలంటే కష్టమే. ఈ నేపథ్యంలో మెను ఛార్జీల్లో కోతపెట్టి సర్దుబాటు చేసుకొస్తున్నాం.

-ముప్పాల లచ్చయ్య, హాస్టల్ వార్డెన్, తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాల

పాచిపెంటలో పడకలూ కరువే!

పాచిపెంట మండలం పద్మాపురం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ వసతి గృహంలో తరగతి గదులే పడక గదులు. మొత్తం ఇక్కడున్న 243 మంది విద్యార్థులు తాము కూర్చున్నచోటే పడుకోవాల్సిన దుస్థితి. మంచాలు లేకపోవడంతో కటిక నేలపైనే నిద్రిస్తున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే తరగతుల నిర్వహణ కష్టంగా ఉంటోంది. కిటికీలు ఊడిపోయాయి. వర్షాలు కురుస్తుండడంతో తరచూ పాములు, తేళ్లు వంటి విషసర్పాల బెడద ఎదుర్కొంటున్నారు. వంట గది, డైనింగ్ హాలు లేవు. వారిలోకాని మరుగుదొడ్లు ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తీవ్ర జ్వరంతో శంబర పిహెచ్‌సిలో సోమవారం చేరారు. వీరిలో ఎరకుటు అనే విద్యార్థికి జ్వరం అదుపులోకి రాకపోవడంతో పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు.

కురుపాంలో భయం.. భయం

కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలకు వస్తేందుకు విద్యార్థినులు భయపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా పంపడం లేదు. ఇక్కడ 609 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ వసతి గృహంలో అంజలి, కల్పన అనే ఇద్దరు విద్యార్థినులు పచ్చకామెర్లతో ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. అప్పట్లో కలెక్టర్ వారం రోజులపాటు సెలవు ప్రకటించారు. ఈ నెల 15న వసతి గృహం పునఃప్రారంభమైంది. ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే తిరిగి వచ్చారు. తాగునీరు, పరిశుభ్రత, వైద్యం, ఆరోగ్య తనిఖీలాపై ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పంపేందుకు సాహసించడం లేదు. ఈ వసతి గృహం బోసిపోతోంది.

ముంచుకొస్తున్న 'మొంథా'

(మొదటిపేజీ తరువాయి)

మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. నదులు, సముద్ర తీరాల్లో వేటలు పట్టడం, అన్ని బోటింగ్ కార్యకలాపాలు బుధవారం వరకు నిలిపివేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో సూచించారు.

సహాయక చర్యల కోసం రూ.14 కోట్లు విడుదల

మొంథా తుపాను నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా కలెక్టర్లకు ప్రభుత్వం రూ.14 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 111ను విపత్తు నిర్వహణ శాఖ (రెవెన్యూ) విడుదల చేసింది. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు రూ.2 కోట్లు చొప్పున, కడప, అన్నమయ్య, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు రూ.కోటి చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆయా నిధులను శిబిరాలకు ప్రజలను తరలించేందుకు, రక్షిత మంచినీరు అందించడం, ఆహారం సరఫరా, పాలు, ఆరోగ్య శిబిరాలు, పారిశుధ్యం మెరుగుదలకు ఉపయోగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

బల్క్ డ్రగ్ ప్రాజెక్టు ఏర్పాటును విరమించుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాథమిక హక్కు ఉందని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతంలో కాలుష్యం వెదజల్లుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఏ విధంగా విఫలమైందో, ఆ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల భద్రతను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఏ విధంగా విఫలమయ్యారో అందరికీ తెలిసిన విషయమేనని పేర్కొన్నారు. కార్మికులు ప్రాణాలు కోల్పోయినా, తీవ్ర గాయాలకు గురైనా, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగినా ప్రభుత్వం పరిశ్రమల యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలుసందేహాలకు తావిస్తోందని తెలిపారు. బల్క్ డ్రగ్ ప్రాజెక్టును వ్యతిరేకంగా ఉద్యమిస్తోన్న రాజయ్యపేట మత్స్యకారుల అభిప్రాయాలను ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం వెంటనే ఆ ప్రాజెక్టు ప్రతిపాదనను విరమించుకోవాలని శర్మ విజ్ఞప్తి చేశారు.

జీవన సౌరభం


కాలాన్ని ఎలా గడపాలో కాదు.. ఎలా ఉపయోగించుకోవాలో తెలిసినవారు అన్ని పనుల్లో ప్రావీణ్యత సాధిస్తారు.

మీ కోసం

కూరలు వండేటప్పుడు నూనె వేడెక్కగానే కాస్త పసుపు వేస్తే, వాటి సహజరంగు కోల్పోకుండా ఉంటాయి.



ఉడత సాయం



ఆకుపచ్చని తోటలో చిట్టి అనే ఉడత ఉంది. చిట్టి చాలా చురుకైనది, కానీ కొంచెం స్వార్థపరురాలు. తన పని తాను చూసుకుంటూ ఎవరితోనూ మాట్లాడేది కాదు. ఒక రోజు చిట్టి, పండ్లు సేకరించు కుంటూ, ఇంటికి తిరిగి వస్తుంటే దారిలో ఒక బామ్మ కనబడింది. ఆ బామ్మ రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తోంది, కానీ దాటలేక పోతోంది. అటుగా వెళ్తున్న చిట్టి బామ్మని చూసింది. వణుకుతూ చేతికర్రని అటూ ఇటూ తడుతూ ఇబ్బందిపడుతున్న బామ్మని చూసి 'సాయం చేద్దామా? వద్దా?' అనుకుంది. మళ్లీ వెంటనే 'అయినా ఇదంతా నాకెందుకు? నా పని చెడిపోతుంది' అని బామ్మని దాటుకుని వెళ్లి పోయింది. కానీ, బామ్మ భయం, నిస్సహాయత చూసిన తర్వాత, దాని మనసులో ఏదో మార్పు వచ్చింది.

'సరే, కొద్దిసేపే కదా!' అని అనుకుని, ధైర్యం చేసి బామ్మ దగ్గరికి వెళ్ళింది. 'బామ్మా, నేను చిట్టి అనే ఉడతను. మీకు సాయం చేయడానికి వచ్చాను' అంది.

బామ్మ సంతోషించి, 'నువ్వు చిన్నదానివి, నాకెలా సాయం చేస్తావమ్మా?' అని అడిగింది. చిట్టి నవ్వి, 'సైజు చిన్నదైనా, నా మనసు పెద్దది బామ్మా. భయపడకండి' అని చెప్పి, బామ్మ కర్రను కొద్దిగా తోస్తూ, బామ్మకు దారి చెబుతూ, నెమ్మదిగా రోడ్డు దాటించింది. బామ్మ చాలా సంతోషించింది. 'చిట్టీ! నీకు అంతా మంచే జరగాలి. ఈ దారంటా అందరూ వెళ్తున్నారు కానీ ఎవరూ నాకు సాయం చేయలేదు. నువ్వు మాత్రమే సాయం చేశావు. ధన్యవాదాలు తల్లీ' అని ఆశీర్వదించింది.

ఆ సంఘటన తర్వాత చిట్టికి, ఇతరులకు సహాయం చేయడం వల్ల కలిగే సంతోషం తెలిసింది. ఆ రోజు నుండి కేవలం తన గురించే కాకుండా, తోటి జంతువుల కష్టాల గురించి కూడా పట్టించుకోవడం మొదలుపెట్టింది. అప్పటినుండి, అడవి జంతువులన్నీ చిట్టిని మెచ్చుకోవడం మొదలుపెట్టాయి.


– డా. చిట్యాల రవీందర్,
77988 91795.

నేను గీసిన బొమ్మ





మాదాసు లాస్య,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ చెరువు మాదవరం,
నేలకొండపల్లి,
ఖమ్మం.



చుక్కలు కలపండి

పిల్లలూ , ఇక్కడ అంకెలు దగ్గర ఉన్న చుక్కలను వరుసగా కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అంధ విశ్వాసంతో ప్రాణాలు తీస్తున్నారు..

కుటుంబం మొత్తంలో తనొక్కటే పదో తరగతి వరకు చదివింది. ఈలోపే వారి కట్టుబాట్ల ప్రకారం తనకి పెళ్లి చేసేశారు. ఇద్దరు బిడ్డలకి తల్లైంది. స్కూలుకి పోతున్న పిల్లలని చూసుకుని ఎంతో మురిసిపోయింది. తనలా వాళ్లు చదువుకు దూరం కాకూడదని, పెద్ద చదువులు చదివించాలని కలలుగంది. కానీ అక్టోబరు 20న ఆమె జీవితం అర్ధంతరంగా ముగిసిపోయింది. ఆమె కలలేవీ తీరకుండానే, బిడ్డల భవిష్యత్తు కళ్లారా చూడ కుండానే మూఢవిశ్వాసలకి తను బలైపోయింది. కొడవళ్లతో, పారలతో, కత్తులతో నిట్టనిలువునా ఆమెని నరికిచంపేశారు. వారంతా తన కుటుంబ సభ్యులే.. బావలు, తోడికోడళ్లు, వాళ్ల పిల్లలే. హత్యకి గురైన మహిళ పడాబి (37). 'మంత్రగత్తె' నెపంతో బంధువులు ఈ దారుణానికి ఒడిగట్టారు. పశ్చిమ బెంగాల్ కలకత్తా నగరానికి 265 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఛపురి గ్రామంలో ఈ ఘటన జరిగింది.

సంతారా ఆదివాసీ తెగకి చెందిన పడాబీ, తుడు కమ్యూనిటీకి చెందిన మహిళ. 5 ఏళ్ల నుండీ తనపై 'మంత్రగత్తె' ఆరోపణలు చేస్తున్నారని పడాబీ భర్త సుభాస్ వాపోయాడు. ఈ ఆరోపణలు రావడానికి గల కారణం తెలిస్తే చాలా ఆశ్చర్య మేస్తుంది. ఐదేళ్ల క్రితం పడాబీ వదిన సుందరి భర్త అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటినుండే తనపై ఈ నిందలు మోపారు. ఇంట్లో ఎవరికి జ్వరం వచ్చినా, జలుబు చేసినా దానికి పడాబీ కారణమని నిందించేవారు. ఈ పరిస్థితి ఆ మహిళకి ఎంత కష్టంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం. కానీ తను భరించింది. పరిస్థితులు మారతాయని భావించింది. అయితే ఈలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. భర్త లేని సమయం చూసి, బిడ్డల కళ్లెదుటే తనని ఇంటి నుండి బయటికి లాగి నరికిచంపారు. అడ్డు వచ్చిన అత్తమామలని, పిల్లలని, వారించిన ఆడ పడుచుని అందరినీ బెదిరించారు. ఇంత పైశాచికత్వం పెరగడానికి కారణమేంటి? పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వెరసి మూఢ విశ్వాసం..





అందరూ కూలీ చేసుకునేవారే..

నిరక్షరాస్యులైన ఆ కుటుంబాలు తీవ్ర పేదరికం లో కొట్టుమిట్టాడుతున్నాయి. పడాబీ భర్త వ్యవసాయ కూలీ. అతని కుటుంబ సభ్యులు కూడా కూలీనాలీ చేసుకునేవారే. విద్య లేదు. ఉపాధి లేదు. తీవ్ర నిరాశ నిస్పృహలో మునిగిపోయిన ఆ కుటుంబాలు ఈ నేరానికి ఒడిగొట్టాయి. ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. ఇద్దరు పిల్లలకి తల్లిని దూరం చేశాయి.

'మంత్రగత్తె' నెపంతో దేశంలో మరణిస్తున్న వారిలో మహిళలే ఎక్కువ. ముఖ్యంగా వివాహితలు, వితంతువులు, ఒంటరి మహిళలు, పిల్లలు లేని స్త్రీలే లక్ష్యంగా ఉంటున్నారు. బీహార్, ఛత్తీస్‌గడ్, ఒరిస్సా, జార్ఖండ్ వంటి పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఘటనలు తరచూ వెలుగుచూస్తుంటాయి. ఈ మధ్య కాలంలో ఇవి ఎక్కువయ్యాయని నివేదికలు చెబుతున్నాయి.

అత్యంత క్రూరంగా వరుస హత్యలు..

ఈ ఏడాది జులైలో జార్ఖండ్ సరిహద్దు బిర్భుమ్ జిల్లా మస్రా గ్రామంలో మానసిక వైకల్యంతో బాధ పడుతున్న వృద్ధురాలిపై 'మంత్రగత్తె' నెపం వేసి చంపేశారు. వివస్త్రని చేసి, నడి రోడ్డుపై కొట్టు కుంటూ, ఈడ్చుకుంటూ తీసుకెళ్ళారు. బీహార్‌లో ఈ దారుణాలకి లెక్కే లేదు. ఈ జులైలోనే పూర్ణియా జిల్లాలో ఒక గిరిజన కుటుంబం మొత్తాన్ని సజీవ దహనం చేశారు. ఒరిస్సాలో ఆగస్టులో వారం రోజుల వ్యవధిలోనే వరుసగా నాలుగు హత్యలు జరిగాయి. ఈ అక్టోబరులో జార్ఖండ్‌లో కేక్రాంగ్ బార్టోలి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులని నరికి చంపారు. అయితే ఇవన్నీ అధికారికంగా నమోదుచేసిన సమాచారం. నమోదు కాని ఘటనలు అనేకం ఉంటాయని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

పరిస్థితులను మరింత దిగజార్చుతున్న మత సంస్థలు

ఛపురి గ్రామంలో జరిగిన సంఘటన గురించి 'ఆదివాసీ అధికార్ మంచ్' ఆల్ ఇండియా వెస్ట్ బెంగాల్ సెక్రటరీ డాక్టర్ పులిన్ బిహారీ ఇలా వివరించారు. 'ఈ తరహా ఘటనలు ఇంతకు ముందూ జరిగాయి. అయితే హత్యలు జరిగిన ప్రతిసారీ చర్యలు తీసుకుంటామని నాయకులు చెబుతున్నారు. కానీ అవి అమలు కావడం లేదు. ప్రభుత్వాలు మూఢ నమ్మకాలని వ్యతిరేకంగా ప్రచారాలు చేయడం లేదు. పైగా ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు మత ఛాందసవాదాన్ని, మూఢనమ్మకాలని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నాయి' అని బిహారీ చెప్పారు. ఈ చర్యల ఫలితంగా 'గిరిజన సమూహాల్లో కొంతమంది ఈ దుర్మార్గపు ఆచారాలని ప్రారంభిస్తున్నారు. కుటుంబాలకి కుటుంబాలు వీటికి ప్రభావితమవుతున్నాయి. ఆదరణ లేక పిల్లలు ఒంటరివాళ్లు అవుతున్నారు' అని కూడా ఆయన వాపోయారు. 2022 నుండి 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ' ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చడం కూడా ఈ దారుణాలకి ఒక కారణమని బిహారీ అంటున్నారు.

గ్రామమంతా పేదరికం..

ఘటన జరిగిన తరువాత ఛపురి గ్రామానికి వెళ్లిన మీడియా బృందానికి అక్కడి వాస్తవ పరిస్థితులు ఇలా కనిపించాయి. 'పడాబీ చనిపోయిన ప్రాంతంలో ఎండిన రక్తపు మరకలు ఉన్నాయి. ఆమె వేసుకున్న చెప్పులు ఇంకా అక్కడే పడి ఉన్నాయి. ఆమె భర్త, అత్తమామలు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నిందితుల్లో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. కొంతమంది పరారీలో ఉన్నారు. వాళ్ల ఇళ్లన్నీ తాళలు వేసి ఉన్నాయి. గ్రామంలో వ్యవసాయ పనుల్లేక, ఉపాధిహామీ పనుల్లేక గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. చాలామంది పోషకాహారలోపంతో ఉన్నారు. నిరక్షరాస్యతకి తోడు నిరుద్యోగంతో ఆ ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఆకలితో ఉన్న వారు క్రమంగా నేరస్వభావాన్ని అలవర్చుకుంటున్నారు'.

భయం భయంగా బతుకుతారు..


జాతీయ నేర గణాంకాల బ్యూరో గతేడాది ఇచ్చిన నివేదిక ప్రకారం 2000వ సంవత్సరం నుండి దేశంలో 2,500 మంది 'మంత్రగత్తె' నెపంతో హత్యకి గురయ్యారు. వెలుగులోకి రానివి ఈ సంఖ్యకి రెట్టింపు ఉండవచ్చు. అయితే 'ఈ ఘటనలు కేవలం ఆయా రాష్ట్రాలకే పరిమితం చేసి చూడకూడదు. ఇది జాతీయ విపత్తుగా పరిగణించాలి' అని జార్ఖండ్‌కి చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త అజయ్ జైశ్వాల్ అంటున్నారు. 'ఒక్కసారి 'మంత్రగత్తె' నింద మోపబడిన మహిళలు ఏ క్షణమైనా తాము చంపబడతామని నిత్యం భయపడుతూ బతుకుతారని జైశ్వాల్ తన అనుభవాల నుండి చెప్పారు.

కుల, మత వివక్ష ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన సమూహాలు, షెడ్యూల్ తెగల్లోని మహిళలని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని చాలాసార్లు చెప్పుకున్నాం. ఆ పరిస్థితిని ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతఛాందస సంస్థలు మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తున్నాయి అనడానికి ఇంతకంటే తాజా ఉదాహరణలు అవసరం లేదు. బీహార్ ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకోవాలని పరితపిస్తున్న మోడీ బృందానికి ఈ మహిళల గోడు అసలే అక్కర్లేదు.



'బాహుబలి ది ఎపిక్' ట్రైలర్ విడుదల

రెండు భాగాలుగా రిలీజ్ అయిన బాహుబలి చిత్రం ఇప్పుడు ఒకే భాగంగా రానుంది. 'బాహుబలి ది ఎపిక్' పేరుతో రాజమౌళి ఈ సినిమాని విడుదలచేస్తున్నారు. తాజాగా బాహుబలి ది ఎపిక్ ట్రైలర్‌ను చిత్రబృందం రిలీజ్ చేశారు. 'ఇద్దరు అన్నదమ్ములు.. ఒక సింహాసనం, ఇద్దరు మహిళలు.. ఒక పోరాటం, రెండు ప్రామిస్‌లు.. ఒక అతిక్రమణ' అంటూ మొత్తం కథను ఈ ట్రైలర్‌లో చెప్పారు. అమరేంద్ర బాహుబలి స్టోరీని ముందు చూపించి ఆ తరువాత మహేంద్ర బాహుబలిని చూపించారు. అక్టోబర్ 31న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



'మా ఇంటి బంగారం' షూటింగ్

కథానాయిక సమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. ఇందులో ఆమె గృహిణిగా నటిస్తున్నారు. సమంత పుట్టినరోజు సందర్భంగా 2024లోనే ఈ మూవీని అధికారికంగా ప్రకటించారు. షుటింగ్ ప్రారంభించలేదు. ఈ వారంలోనే సినిమా చిత్రీకరణ వేగంగా జరుగుతుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా సినిమాకు నందినీరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో సినిమా షూటింగ్ జరుగుతోంది. సమంత పాల్గొంటున్నారు. ఈ సినిమాలో నటించడంతో పాటు సమంత తన నిర్మాణ సంస్థ ట్రలాలా పిక్చర్స్‌పై నిర్మిస్తున్నారు.

'శివ' రీ రిలీజ్.. రెండు లారీల పేపర్లు..



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగార్జున హీరోగా నటించిన 'శివ' చిత్రం 36 ఏళ్ల తరువాత ఈ నవంబర్ 14న రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రముఖులు, దర్శకులు 'శివ' తమ జీవితంపై చూపిన ప్రభావం గురించి పంచుకుంటున్నారు. శేఖర్ కమ్ముల, అశుతోష్ గోవారికర్ తమ అనుభవాలను వీడియోల రూపంలో పంచుకోగా, తాజాగా అల్లు అర్జున్ కూడా స్పెషల్ మెసేజ్ ఇచ్చారు. ఆ వీడియోలో బన్నీ మాట్లాడుతూ.. 'తెలుగు సినిమా చరిత్రలో 'శివ' ఒక ఐకానిక్ చిత్రం. ఆ ఒక్క సినిమా భారతీయ సినీ పరిశ్రమకు కొత్తదారులు చూపింది. మాస్, రియలిజం, టెక్నికల్ బ్రిలియన్స్ అన్నీ కలిపిన ఒక అద్భుతం అది. అలాంటి సినిమా మళ్లీ థియేటర్లలోకి వస్తుంటే ఆ వేడుకను గ్రాండ్‌గా జరుపుకోవాలి. అక్కినేని అభిమానులకే కాకుండా ప్రతి తెలుగు సినిమా ప్రియుడికి ఇది సెలబ్రేషన్ లాంటిది. ఈసారి థియేటర్‌కి వెళ్లేటప్పుడు రెండు లారీల పేపర్లు తీసుకెళ్లండి!' అని మాట్లాడారు.

బాలీవుడ్ నటుడు సతీష్ షా కన్నుమూత



ప్రముఖ బాలీవుడ్ నటుడు సతీష్ షా(74) శనివారం మధ్యాహ్నం మరణించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. 'సారాభాయి వర్సెస్ సారాభాయి'(టెలివిజన్ షో), 'హమ్ సాత్ సాత్ హైనా', 'మైనే హూన్ నా', 'ఓం శాంతి ఓం' వంటి అనేక ప్రముఖ చిత్రాల్లో ఆయన నటనకి ప్రేక్షకాదరణ దక్కింది. సుమారు 4 దశాబ్దాలు చిత్రసీమలో టెలివిజన్ షోలలో ఎన్నో పాత్రలు పోషించారు. చిత్రసీమ ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపింది.

'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ విడుదల



రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక హీరోయిన్‌గా రాబోతున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 7వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో తాజాగా అక్టోబర్ 25న ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. 'ట్రెండింగ్ లో ఉన్న అంశాలను తెరకెక్కించాలి అనే ఆలోచనను పక్కన పెట్టి ఒక మంచి కథతో నేను మీ ముందుకు వచ్చాను. సాధారణంగా రిలేషన్‌లో ఉన్న వారు ఎవరైనా సరే ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజ జీవితాలకు దగ్గరగా ఉంటుంది. నా టీం సపోర్ట్ వల్లే ఈ సినిమాను ఈరోజు నేను మీ ముందుకు తీసుకురాగలుగుతున్నాను. 13 ఏళ్ల నుంచి నేను ఈ కథ గురించి ఆలోచిస్తున్నాను. నేను హాస్టల్లో ఉన్నప్పుడు జరిగిన ఒక చిన్న సంఘటన ఈ సినిమాకు పునాది వేసింది. గత ఐదు సంవత్సరాల క్రితమే దానిని స్క్రీన్ ప్లేగా రాసుకున్నాను. ఇన్ని రోజులకు ఈ చిత్రం మీ ముందుకు వచ్చింది' అని తెలిపారు. రష్మిక లీడ్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి కీలకపాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్ రష్మిక తండ్రి పాత్రలో నటిస్తుండగా.. అను ఇమ్మానుయేల్ మరో హీరోయిన్‌గా చేస్తున్నారు.

రో-కో అదరహో...

- రోహిత్ సెంచరీ, కోహ్లి అర్ధసెంచరీ
- మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం
- సిరీస్ 2-1తో ఆస్ట్రేలియా కైవసం

రో-కో రీలోడెడ్

రోహిత్, కోహ్లి (రో-కో) కలిసి నిలబడితే భారత్‌కు ఎదురే లేదని మరోసారి రుజువైంది. సగటు భారత అభిమాని కోరుకునేది ఇదే కదా..! చాలా రోజుల తర్వాత ఇద్దరూ కలివిడిగా ఆడి.. విడివిడిగా గెలిచారు.. భారత్‌ను గెలిపించారు. రిటైర్మెంట్ వార్తల వేళ ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో రోహిత్ సెంచరీ, విరాట్ అర్ధ సెంచరీ చేసి అందరినీ మరోసారి ఆకట్టుకున్నారు.



సిడ్నీ: వన్డే సిరీస్ చేజార్చుకున్న టీమిండియా.. చివరి వన్డేలో దుమ్ము రేపింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని భారతజట్టు కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి 2వ వికెట్‌కు అజేయంగా 168 పరుగులు జతచేసి మ్యాచ్‌ను ముగించారు. దీంతో భారతజట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను భారత బౌలర్లు కట్టడి చేశారు. హర్షిత్ రాణా(4/39), సుందర్(2/44)కి తోడు సిరాజ్, ప్రసిధ్, కుల్దీప్, అక్షర్ ఒక్కో వికెట్‌తో రాణించారు. దీంతో ఆస్ట్రేలియా 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో టీమిండియాకు శుభారంభం లభించింది. శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. 24 పరుగుల వద్ద హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి కెప్టెన్ శుభ్‌మన్ వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లీ తొలి బంతికే తన పరుగుల ఖాతా తెరిచాడు. తొలి రెండు వన్డేల్లో డకౌట్ అయిన కోహ్లి ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. రో-కో ధాటికి ఆసీస్ బౌలర్లు తేలిపోయారు. వీరు రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగులు జత చేసి మ్యాచ్‌ను ముగించారు. రెండో మ్యాచ్‌లో అర్ధ శతకం చేసిన రోహిత్ ఈ వన్డేలో 105 బంతుల్లో సెంచరీ కొట్టాడు. 125 బంతుల్లో 121 పరుగులతో అజేయంగా నిలిచాడు. రోహిత్ శర్మ కెరీర్‌లో ఇది 50వ సెంచరీ. వన్డేల్లో అతడికిది 33వ శతకం. ఇక విరాట్ కోహ్లి 56 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. 81 బంతుల్లో 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రో-కో ద్వయం రాణించడంతో టీమిండియా 38.3 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా అందుకుంది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ మాత్రమే ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు ఆసీస్ బ్యాటర్లలో మ్యాట్ రెన్‌షా(56), మిచెల్ మార్ష్(41) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. 1986 తర్వాత ఇలా ఆసీస్‌పై ప్రతి బౌలరూ వికెట్ తీయడం ఇదే తొలిసారి. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో కైవసం చేసుకోగా.. 29(బుధవారం) నుంచి ఐదు టి20 సిరీస్ ప్రారంభం కానుంది.

రోహిత్ @ 50వ సెంచరీ

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 50వ సెంచరీని కొట్టాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి 50 సెంచరీలు కొట్టిన రోహిత్... ఒక్కో ఫార్మాట్‌లో ఐదు అంతకుమించి సెంచరీలు కొట్టిన ఏకైక బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ రోహిత్ శర్మకు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (బి)అక్షర్ 41, హెడ్ (సి)ప్రసిధ్ (బి)సిరాజ్ 29, షార్ట్ (సి)కోహ్లి (బి)సుందర్ 30, రెన్‌షా (ఎల్‌బి)సుందర్ 56, క్యారీ (సి)శ్రేయస్ (బి)హర్షిత్ రాణా 24, కూపర్ (సి)కోహ్లి (బి)హర్షిత్ రాణా 23, ఓవెన్ (సి)రోహిత్ (బి)హర్షిత్ రాణా 1, స్టార్క్ (బి)కుల్దీప్ 2, ఎల్లిస్ (సి)రోహిత్ (బి)ప్రసిధ్ 16, జంపా (నాటౌట్) 2, హేజిల్‌వుడ్ (బి)హర్షిత్ రాణా 0, అదనం 12. (46.4ఓవర్లలో ఆలౌట్) 236పరుగులు. **వికెట్ల పతనం:** 1/61, 2/88, 3/124, 4/183, 5/195, 6/198, 7/201, 8/223, 9/236, 10/236 **బౌలింగ్:** సిరాజ్ 5-1-24-1, హర్షిత్ రాణా 8.4-0-39-4, ప్రసిధ్ 7-0-52-1, కుల్దీప్ 10-0-50-1, అక్షర్ 6-0-18-1, సుందర్ 10-0-44-2.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (నాటౌట్) 121, శుభ్‌మన్ గిల్ (సి)క్యారీ (బి)హేజిల్‌వుడ్ 24, కోహ్లి (నాటౌట్) 74, అదనం 18. (38.3ఓవర్లలో వికెట్ నష్టానికి) 237పరుగులు. **వికెట్ల పతనం:** 1/69 **బౌలింగ్:** స్టార్క్ 5-0-31-0, హేజిల్‌వుడ్ 6-1-23-1, ఎల్లిస్ 7.3-0-60-0, కూపర్ 5-0-36-0, జంపా 10-0-50-0, ఓవెన్ 1-0-2-0, షార్ట్ 4-0-29-0.

సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఆసీస్

- చివరి లీగ్‌లో దక్షిణాఫ్రికా చిత్తు..
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్



ఇండోర్: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆస్ట్రేలియా జట్టు 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. దక్షిణాఫ్రికా జట్టు రెండోస్థానానికే పరిమితమైంది. నేడు చివరి లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. ఈ మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా సెమీస్ బెర్త్‌లు ఇప్పటికే ఖరారయ్యాయి. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య 29(బుధ) తొలి సెమీస్, భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 30(గురు) రెండో సెమీస్ జరగనుంది. ఈ మెగా టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ పరాజయాన్ని చవిచూడకుండా సెమీస్‌కు చేరడం విశేసం.

దక్షిణాఫ్రికాపై ఆసీస్ అలవోకగా..

ప్రపంచ కప్‌లో అద్భుత విజయాలతో టాప్‌లో నిలిచిన దక్షిణాఫ్రికా మహిళల జట్టుకు చివరి లీగ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాభవం తప్పలేదు. తొలి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 69 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా జట్టు.. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో 97 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఆసీస్‌ను ఓడించి ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలనుకున్న దక్షిణాఫ్రికా ఆశలు అడియాశలయ్యాయి. ఇండోర్‌లో ఏకపక్షంగా సాగిన పోరులో అలనా కింగ్(7/18) సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కుప్పకూల్చింది. స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ 16.5 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను ముగించింది. బేత్ మూనీ(42) ఔటైనా.. సథర్‌లాండ్(10 నాటౌట్) రెండు ఫోర్లు బాదడంతో ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68